RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 356 మేడ్చల్ మల్కాజ్‌గిరి 16 జనవరి 2025 గురువారం పేజీలు : 4

## ప్రయాగ్‌రాజ్‌లో.. 5.5కోట్ల మంది పుణ్యస్నానాలు

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ జిల్లాలో సంగం నది ఒడ్డున నిర్వహించబడుతున్న మహా కుంభమేళాలో ఈరోజు మూడవ రోజు. జనవరి 13 నుండి ప్రారంభమైన మహా కుంభమేళాలో ప్రతిరోజూ కోట్లాది మంది త్రివేణి సంగమంలో స్నానాలు చేస్తున్నారు. మంగళవారం మకర సంక్రాంతి సందర్భంగా తెల్లవారుజామున 3 గంటల నుంచే వివిధ అఖాడాల నుంచి సాధువులు వేలాదిగా తరలివచ్చారు. తొలి రోజున 1.75 కోట్ల మంది పవిత్ర స్నానాలు చేయగా.. సంక్రాంతి ఒక్కరోజునే మొత్తం 3.5 కోట్ల మంది భక్తులు అమృత స్నానాలు చేశారు. రెండు రోజుల్లోనే 5.5 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్‌లో పవిత్ర స్నానాలు ఆచరించినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది.




## భజనలు, హర్ హర్ మహాదేవ్ నామస్మరణతో

# మార్మోగుతోన్న ప్రయాగ్‌రాజ్..

## కుంభమేళాలో సరికొత్త రికార్డ్!

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా మూడో రోజుకు చేరుకుంది. ఈ మహాకుంభమేళాకు తెల్లవారుజామునుంచే భక్తులు పోటెత్తుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ భక్త జనసంద్రాన్ని తలపిస్తోంది. మహాకుంభమేళాకు మూడో రోజు కూడా భక్తులు లక్షలాదిగా తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో భక్తుల పుణ్యస్నానాలు కొనసాగుతున్నాయి. నదీమతల్లికి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. భారీగా తరలివస్తున్న భక్తులతో త్రివేణి సంగమంలో ఆధ్యాత్మిక శోభ కొనసాగుతోంది. భక్తుల భజనలు, హర్ హర్ మహాదేవ్ నామస్మరణతో ప్రయాగ్‌రాజ్ మార్మోగుతోంది. మహాకుంభమేళాను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యూపీ ప్రభుత్వం.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు చేసింది. ఈ సారి మహా కుంభమేళాకు 40కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద మతపరమైన ఆధ్యాత్మిక పండుగ మహా కుంభ్ ఈసారి సంగం నగరం ప్రయాగ్‌రాజ్‌లో ఘనంగా నిర్వహిస్తున్నారు. లక్షలాది సంవత్సరాల క్రితం కుంభం నుండి జారిన అమృతాన్ని వెతుక్కుంటూ గంగా-యమునా, అదృశ్య సరస్వతి ఒడ్డుకు భక్తులు గుంపులు గుంపులుగా పెద్ద ఎత్తున తరలి వస్తారు. మకర సంక్రాంతి రోజున అంటే మంగళవారం(జనవరి 14)నాడు 3.5 కోట్ల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సంఖ్య నిజంగా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎందుకంటే ప్రపంచంలోని 234 దేశాల్లో కేవలం 45 దేశాల్లో మాత్రమే 3.4 కోట్లకు పైగా జనాభా ఉంది. అంటే 189 దేశాల జనాభా కంటే పెద్ద జనసమూహం ఒకేసారి సామూహిక స్నానానికి సంగం నగరికి చేరుకుంది. ఇది దేవుని పట్ల ప్రజలకు ఉన్న నిజమైన విశ్వాసాన్ని తెలియజేస్తుంది. మకర సంక్రాంతి రోజున, భక్తులు గంగలో స్నానమాచరించిన వెంటనే, కుంభం నుండి అమృతం చిందినట్లు త్రివేణి సంగమం చుక్కలు చిమ్మడం ప్రారంభించాయి. వివిధ అఘోరాలకు చెందిన సాధువులు మంగళవారం మహాకుంభంలో మొదటి 'అమృత స్నాన్' తీసుకున్నారు. ఈ సందర్భంగా త్రివేణి సంగమం వద్ద జనం భారీగా తరలివచ్చారు. మహా కుంభ్‌లోని చాలా అఘోరాలకు బూడిద ధరించిన నాగ సాధువులు నాయకత్వం వహించారు. వారు తమ క్రమశిక్షణ, సాంప్రదాయ ఆయుధాలపై పట్టుతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. నైపుణ్యంతో ఈటెలు, కత్తులు పట్టుకోవడం నుండి ఉద్వేగభరితంగా డ్రమ్ములు వాయించడం వరకు, వారి ప్రదర్శనలు పురాతన సంప్రదాయాల ఉత్సాహభరితమైన వేడుక అని అధికారిక ప్రకటన తెలిపింది. మహాకుంభ్‌లో పురుష నాగ సాధువులే కాకుండా, పెద్ద సంఖ్యలో మహిళా నాగ సన్యాసులు కూడా అమృత స్నానం అచరించారు. మహా కుంభం మొదటి ప్రధాన స్నానం సోమవారం 'పౌష్ పూర్ణిమ' సందర్భంగా జరిగింది. అయితే అఘోరాలు, హిందూ మఠాల సభ్యులు మకర సంక్రాంతి రోజున వారి మొదటి స్నానం చేశారు. శ్రీ పంచాయతీ అఘోరా మహానిర్వాణి, శ్రీ శంభు పంచాయతీ అటల్ అఘోరా మొదట 'అమృత స్నాన్' తీసుకున్నారు. మహాకుంభ్‌లో వేలాది మంది అఘోరాలు పాల్గొంటున్నారు. అమృత స్నాన్ సందర్భంగా హెలికాప్టర్ నుంచి భక్తులపై గులాబీ రేకుల వర్షం కురిపించారు. ప్రయాగ్‌రాజ్‌లో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి పూర్ణ కుంభం నిర్వహిస్తారు. అయితే 12 పూర్ణ కుంభాల తర్వాత 144 సంవత్సరాలకు ఒకసారి మహాకుంభం జరుగుతుందని మహానిర్వాణి అఖారాకు చెందిన మహామండలేశ్వర చేతన్‌గిరి మహారాజ్ అన్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం భక్తులకు అరుదైన వరం. 68 మంది మహామండలేశ్వరులు, మహానిర్వాణి అఘోరాకు చెందిన వేలాది మంది సాధువులు అమృత స్నానంలో పాల్గొన్నారు. 35 మంది మహామండలేశ్వరులు, నిరంజని అఘోరాకు చెందిన వేలాది మంది నాగ సాధువులు అమృత స్నాన్‌లో పాల్గొన్నారు.

ఇది కాకుండా, జునా అఘోరా, ఆవాహన్ అఘోరా, పంచాగ్ని అఘోరాకు చెందిన వేలాది మంది సాధువులు కూడా అమృత్‌లో స్నానం చేశారు. ఆచార్య మహామండలేశ్వర్ స్వామి అవధేశానంద గిరి నేతృత్వంలోని కిన్నార్ అఘోరా సభ్యులు కూడా జునా అఘోరాతో పాటు పవిత్ర స్నానమాచరించారు.

పెద్ద రథంలో ఘాట్ వద్దకు చేరుకున్న నాగ సాధువుల బృందం అనుసరించింది.నాగ సాధువులు ఈటెలు, త్రిశూలాలను ధరించి, వారి శరీరాలపై బూడిద పూసుకుని, కొన్ని గుర్రాలతో ఊరేగింపుగా రాజ స్నానానికి బయలుదేరారు. జుట్టులో పువ్వులు, మెడలో దండ, చేతిలో త్రిశూలంతో మహాకుంభానికి ఆధ్యాత్మిక వైభవాన్ని జోడించింది.




హైదరాబాద్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సొంతూళ్లకు వెళ్లిన హైదరాబాద్ వాసులు తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న వాహనాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. యాదాద్రి జిల్లా పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్దకు భారీగా వాహనాలు చేరుకుంటున్నాయి. పంతంగి టోల్‌ప్లాజాలోని 12 టోల్‌బూత్‌ల ద్వారా ఏపీ నుంచి తెలంగాణ వైపు వాహనాలను అనుమతిస్తున్నారు. కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరడంతో నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఏపీ వ్యాప్తంగా ప్రయాణ ప్రాంగణాల్లోనూ రద్దీ పెరుగుతోంది. సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరుగుపయనమవడంతో విజయవాడ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో రద్దీ ఒక్కసారిగా పెరిగింది. రద్దీని దృష్టిలో పెట్టుకొని పలు ప్రాంతాలకు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తదితర ప్రాంతాలకు 116 అదనపు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. అదనపు బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని.. సాధారణ ఛార్జీలే వసూల చేస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ తెలిపింది.

## నాలుగు పథకాల లబ్ధిదారుల ఎంపిక.. కలెక్టర్లకు సీఎస్ కీలక సూచనలు



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న నాలుగు కొత్త పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 21 నుంచి గ్రామసభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. ఎలాంటి అపోహలకు తావు లేకుండా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. గ్రామ పంచాయతీలు, పట్టణాలు, నగరాల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాల లబ్ధిదారుల ఎంపికపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతు భరోసా కోసం భూముల వివరాలను రెవెన్యూ శాఖ ద్వారా వ్యవసాయ శాఖకు పంపించినట్లు సీఎస్ తెలిపారు.

''క్షేత్రస్థాయిలో పరిశీలించి సాగుయోగ్యం కాని భూములను గుర్తించాలి. వాటి వివరాలను గ్రామసభల్లో ప్రదర్శించాలి. 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' కోసం కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులకు వెళ్లిన భూమి లేని రైతు కూలీల కుటుంబాలను గుర్తించి.. ఆ జాబితాను గ్రామ సభల్లో ప్రకటించాలి. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారుల ముసాయిదా జాబితాను గ్రామ, వార్డు సభల్లో వివరించి ఆమోదం పొందాలి. అభ్యంతరాలుంటే స్వీకరించాలి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున.. ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి'' అని కలెక్టర్లకు సూచనలు చేశారు.




డిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి సంబంధించిన కొత్త భవనాన్ని సోనియా గాంధీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ దిగ్గజ నాయకులు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, %బూజజ% చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా పాల్గొన్నారు. ఈ కార్యాలయానికి 'ఇందిరాగాంధీ భవన్' అని పేరు పెట్టారు. ఇది కాంగ్రెస్ పార్టీకి గౌరవంగా కనిపిస్తుంది. ఇందిరాగాంధీ భవన్ 1978 నుంచి అక్బర్ రోడ్డులో ఉన్న కాంగ్రెస్ కార్యాలయానికి భిన్నంగా, 9%జూ% కోట్లా రోడ్డులో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించారు. ఈ భవనంలో ఆరు అంతస్తులు ఉండి, రాజకీయ కార్యకలాపాలకు అవసరమైన అన్ని ఆధునిక సౌకర్యాలు ఉన్నాయి. దీనివల్ల పార్టీ కార్యాచరణకు మరింత సమర్థత మరియు సౌలభ్యం లభించనుంది. ఇది కాంగ్రెస్ పార్టీకి ఒక మైలురాయిగా చెప్పవచ్చు. ఎందుకంటే ఇది కాంగ్రెస్ అఖిల భారత కార్యాలయానికి కొత్త ఉత్సాహాన్ని అందిస్తుంది. కొత్త కార్యాలయం ప్రారంభం, కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా మరింత శక్తివంతమైన నాయకత్వాన్ని అందిస్తుంది. ఈ కార్యాలయాన్ని ప్రారంభించడం.. కాంగ్రెస్ పార్టీకి తిరిగి పుంజుకోవడం కోసం కీలకమైన దశగా భావిస్తున్నారు. ఇక్కడి నుండి జాతీయ, రాష్ట్ర స్థాయి వ్యూహాలను అభివృద్ధి చేయడం, ప్రణాళికలు అమలు చేయడం కొనసాగుతుంది. ఈ కొత్త కార్యాలయం ప్రారంభం, పార్టీ నాయకత్వానికి కొత్త ఆలోచనలకు, దృష్టికి మార్గదర్శకంగా నిలుస్తుంది. ఇందిరాగాంధీ భవన్ పేరుతో ఈ కొత్త భవనం కాంగ్రెస్ పార్టీ యొక్క సంప్రదాయాలను, ఆధునికతను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరికీ ప్రేరణ ఇచ్చే మార్గంగా ఉంది.

| DATE | DEP/ ARR | TIME | DEP/ARR PLACE |
|---|---|---|---|
| 16.01.2025 | DEP. | 21.50 | DELHI IGI AIRPORT |
| 17.01.2025 | ARR. | 06.00 | SINGAPORE (CHANGI) |
| 20.01.2025 | DEP. | 00.05 | SINGAPORE (CHANGI) |
| 20.01.2025 | ARR. | 06.10 | ZURICH AIRPORT |
| 23.01.2025 | DEP. | 14.35 | ZURICH |
| 23.01.2025 | ARR. | 23.45 | ...BAI |
| 24.01.2025 | DEP. | 03.30 | DUBAI |
| 24.01.2025 | ARR. | 08.25 | HYDERABAD |




## నేడు దావోస్ పర్యటనకు సీఎం రేవంత్..!

హైదరాబాద్: ఈ నెల 16న అంటే రేపు దావోస్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లనున్నారట. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. పీఆర్ టీమ్ కు కీలక ఆదేశాలు ఇచ్చింది కాంగ్రెస్. ఎప్పటికప్పుడు అలర్ట్ గా ఉండాలని%ొ%సోషల్ మీడియాలో అప్డేట్స్ ఇవ్వాలని ఆర్డర్స్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. కాగా ప్రస్తుతం ఢిల్లీలోనే సీఎం రేవంత్ రెడ్డి ఉన్న విషయం తెలిసిందే. ఇవాళ కాంగ్రెస్ నూతన కార్యాలయం ప్రారంభం కానుంది. కాంగ్రెస్ పార్టీ నూతన ప్రధాన కార్యాలయ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంది. కొత్త భవనంతో పాటు, త్వరలో సరికొత్త రూపును సంతరించుకోనుంది కాంగ్రెస్ పార్టీ. ఈ కార్యక్రమంలో కోసం నిన్ననే ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారు. ఏఐసీసీ కేంద్ర కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం కాంగ్రెస్ పెద్దలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. తెలంగాణ మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ కార్యవర్గం కూర్పు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలపై వారితో చర్చించనున్నారు. అలాగే పలువురు కేంద్ర మంత్రులను సీఎం కలవనున్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి వారితో మాట్లాడనున్నారు. కేంద్రమంత్రులను కలిసే సమయంలో సీఎం వెంట ఆయా శాఖల రాష్ట్ర మంత్రులు ఉంటారు. అనంతరం గురువారం రాత్రి ఢిల్లీ నుంచి సింగపూర్ పర్యటనకు రేవంత్ రెడ్డి వెళతారు. సింగపూర్‌కు చేరుకున్న తర్వాత రేవంత్ బృందం శుక్రవారం అక్కడ జరిగే బిజినెస్ మీట్‌లో పాల్గొంటారు.

పలువురు పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అవుతారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే స్పోర్ట్స్ యూనివర్శిటీకి సంబంధించి సింగపూర్‌లో ఉన్న స్పోర్ట్స్ యూనివర్శిటీని సందర్శిస్తారు. ఆ యూనివర్శిటీకి సంబంధించి పలు విషయాలను తెలుసుకోనున్నారు. అలాగే షాపింగ్ మాల్స్, స్టేడియాల నిర్మాణాలను పరిశీలించే అవకాశం ఉంది. జనవరి 19న సింగపూర్ నుంచి స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు సీఎం రేవంత్ రెడ్డి వెళతారు. 20, 21, 22 తేదీల్లో అక్కడ నిర్వహించే వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పాల్గొని తెలంగాణకు పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకువచ్చే ప్రయత్నం చేయనున్నారు.

# సంపాదకీయం

## ట్రంపా.. మజాకా... విదేశీ ఉద్యోగులు ఉన్న కంపెనీలకు కొత్త టెన్షన్ స్టార్ట్!

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్.. జనవరి 20న అగ్రరాజ్యం అధినేతగా బాధ్యతలు స్వీకరించనున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో నిన్నటివరకూ అమెరికాలోని యూనివర్శిటీలు, కళాశాలలకు టెన్షన్ స్టార్ట్ అవ్వడం.. దీంతో పలు విద్యాసంస్థలు.. వింటర్ విరామం నుంచి ముందుగానే క్యాంపస్ కు తిరిగి రావాలని రిక్వస్టులు పంపడం తెలిసిందే. అంతర్జాతీయ విద్యార్థుల విషయంలో ట్రంప్ సరికొత్త నిబంధనలు ఎలా ఉంటాయనేదానిపై తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో... అమెరికాలోని యూనివర్శిటీలు, కాలేజీలకు ట్రంప్ టెన్షన్ మొదలైందని.. వింటర్ విరామానికి ముందే క్యాంపస్ లకు తిరిగిరావాలని మెయిల్స్ పెట్టాయని చెబుతున్నారు. ఈ సమయంలో ఉద్యోగుల విషయంలోనూ కంపెనీలు అదే పనిలో ఉన్నాయని అంటున్నారు. అవును... 2023-24 అకడమిక్ ఇయర్ లో అమెరికాలోని కాలేజీలు, యూనివర్శిటీ సుమారు 1.1 మిలియన్లకు పైగా అంతర్జాతీయ విద్యార్థులు నమోదు చేసుకున్నట్లు చెబుతున్నారు. అయితే... ట్రంప్ తిరిగి వైట్ హౌస్ కు చేరుకున్న తర్వాత.. కఠినమైన ఇమ్మిగ్రేషన్ నిబంధనల అమలు తెరపైకి తెచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలో... ఇప్పటికే విదేశీ విద్యార్థులకు ఈ మేరకు ఈ-మెయిల్స్ పంపినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా... ట్రంప్ వైట్ హౌస్ కు తిరిగి రావడానికి కనీసం వారం ముందు యూఎస్ కి తిరిగిరావాలని యూనివర్శిటీలు కోరుతున్నాయని అంటున్నారు. ఈ సమయంలో... అమెరికాలో పనిచేస్తున్న విదేశీ ఉద్యోగులకు ఈ మేరకు ఈ-మెయిల్స్ వెళ్లినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా... భారత్ సహా ఇతర దేశాలకు వెళ్లిన తమ ఉద్యోగులు జనవరి 20 లోపు అమెరికాలో వాలిపోవాలని.. ఆ తర్వాత ఏమైన జరిగే అవకాశం ఉందని పలు కంపెనీల యాజమాన్యాలు ఈ-మెయిల్స్ పెడుతున్నాయని చెబుతున్నారు. దీంతో... సంక్రాంతి పండుగ కూడా ప్రశాంతంగా చేసుకోనివ్వడం లేదన్నట్లుగా ఎప్పుడు ఫ్లైట్ దొరికితే అప్పుడు యూఎస్ వెళ్లిపోతున్నారంట జనాలు! కాగా.. ఈ నెల 20న అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టనున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో.. బాధ్యతలు చేపట్టిన తొలిరోజే 100 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లను సిద్ధం చేస్తున్నారని అంటున్నారు. మరోపక్క ప్రధానంగా ఆయన తొలి నిర్ణయం.. విదేశీ ఉద్యోగులు, వీసాలపైనే ఉంటుందనే చర్చా బలంగా సాగుతున్న పరిస్థితి. దానికీ ఓ బలమైన కారణం ఉంది. ఎన్నికల సమయంలోనూ స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు లభించేలా చేస్తానని ట్రంప్ హామీ ఇచ్చారు. ఈ సమయంలో ఆ హామీని నెరవేర్చాలంటే.. "అమెరికా ఫస్ట్" అనే స్లోగన్ కు న్యాయం జరగాలంటే ఆయన ఫస్ట్ టార్గెట్ హెచ్-1బీ వీసాలపై ఆంక్షలు విధించడమే అనే చర్చా తెరపైకి వచ్చింది. హెచ్-1బీ వీసాలు ఆపుతారని కాదు కానీ.. మరింత కఠినమైన నిబంధనలు తెచ్చే అవకాశం మాత్రం ఉందని అంటున్నారు. ఇదే సమయంలో... మరికొన్ని వీసాలను రద్దు చేసే అవకాశాన్ని కొట్టిపారేయలేమని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కంపెనీలు అలర్ట్ అయ్యాయి.. ట్రంప్ కుర్చీ ఎక్కే లోపు తిరిగి అమెరికాకు రావాలని కోరుతున్నట్లు చెబుతున్నారు.

# పల్లె, పట్టణాల్లో సంక్రాంతి సంబరాలు...

ఇంటి వాకిళ్లను రంగవల్లులతో( రంగురంగుల ముగ్గులతో) అలంకరించిన ఆడపడుచులు....

ఆకాశ వీధుల్లో గాలిపటాలతో సందడి చేసిన కుర్ర కారు....




శామీర్ పేట, ( గరుడ వార్త) : సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించినప్పుడు వచ్చే మొదటి పండుగనే మకర సంక్రాంతి అని అంటారు. సంక్రాంతి పండగ బోగి నుంచి మొదలై కనుమ రోజు వరకు కొనసాగుతుంది. ముఖ్యంగా సంక్రాంతి పండగ జరుపుకునే మూడు రోజులు ఇంటి వాకిళ్ళ ముందర కల్లాపి చల్లి అందమైన రంగవల్లులతో( ముగ్గులు) వాకిలిని అలంకరిస్తారు. తూముకుంట మున్సిపాలిటీ షామీర్పేట మూడు చింతలపల్లి మండల పరిధిలోని పట్టణ పల్లెల్లో ఘనంగా సంక్రాంతి పండుగ వేడుకలను జరుపుకున్నాడు. మంగళవారం పూర్వ ఉమ్మడి మండలంలోని తూంకుంట మున్సిపల్, శామీర్ పేట మండలం, మూడు చింతలపల్లి మండలంలోని ప్రజలు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఉదయాన్నే ఇళ్ళ ముందర రంగురంగుల ముగ్గులను వేసి వేడుకలను జరుపుకున్నారు. అలాగే ఎంతో భక్తిశ్రద్ధలతో ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకులు డాబాలపై సౌండ్ బాక్సు ఏర్పాటు చేసుకొని కేరింతలు కొడుతూ గాలిపటాలను పోటాపోటీగా ఎగురవేశారు. మహిళలు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని




నోములు నోచుకొని వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. సంక్రాంతి పండుగ వేడుకలను ఎంతో సంపూర్ణంగా జరుపుకున్నారు.

# మైదానాలు ఇలా.. ఆటలెలా



మెట్‌పల్లి : విద్యార్థులు, యువతకు చదువుతోపాటు మానసికోల్లాసం, శరీర దారుఢ్యానికి క్రీడలు అవసరం. ప్రభుత్వాలు ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా క్రీడా వసతులు అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నాయి. క్రీడల్లో రాణించాలనే పట్టుదల, సంకల్పం యువతలో ఉన్నప్పటికీ అందుకు తగ్గ క్రీడా మైదానాలు, శిక్షకులు లేక నిరుత్సాహానికి గురవుతున్నారు. క్రీడలకు అరకొర నిధులు కేటాయిస్తూ వదిలేస్తున్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పట్టణాల్లో మినిస్టేడియాలు మంజూరుచేస్తూ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మినిస్టేడియం నిర్మాణ పనులు ప్రారంభమై కొన్ని చోట్ల పాక్షికంగా మరికొన్ని చోట్ల 90 శాతం పూర్తయ్యాయి. ధర్మపురి పట్టణంలో ఇంతవరకు పనులే ప్రారంభం కాలేదు. జిల్లాలో మినీ స్టేడియాల స్థితిగతులపై పరిశీలన కథనం.

**ఎనిమిదేళ్లుగా నిరుపయోగం**

ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో 8 ఏళ్ల కిందట రూ.1.60 కోట్లు వెచ్చించి మినీ స్టేడియం నిర్మించారు. 07 జూన్ 2021న అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. స్టేడియంలో క్రీడా పరికరాలను సమకూర్చడంలో యువజన, క్రీడలశాఖ పూర్తిగా విఫలమైంది. షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్యారమ్, ఇతర క్రీడా పరికరాలను ఇప్పటి వరకు ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా వదిలేశారు. స్టేడియం కిటికీల అద్దాలు, ముఖద్వారం, ఇతర నిర్మాణాలను ఆకతాయిలు పూర్తిగా ధ్వంసం చేశారు. మినీ స్టేడియం నిర్మించి ఏళ్లు గడుస్తుండటంతో రంగులు వెలిసిపోయాయి.

**నిధులు మంజూరైనా..**

పట్టణంలోని వెంపేట రోడ్డు పక్కన 1998లో మినీ స్టేడియం, ప్రహరీ నిర్మాణానికి రూ.30 లక్షలు, 2009లో క్రీడా పాఠశాలతోపాటు క్రీడాకారులు ఉండేందుకు వసతిగృహం కోసం రూ.2.10 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టిన వసతిగృహంతోపాటు క్రీడా పాఠశాల, షటిల్‌కోర్టు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. 2022లో స్టేడియం అభివృద్ధి కోసం రూ.50 లక్షలు మంజూరు కాగా మట్టితో వాకింగ్ ట్రాక్, హైమాస్ట్ విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. క్రీడా పోటీలకు, క్రీడాకారులు ఉండేందుకు ఎలాంటి వసతి లేదు. తాగునీరు కూడా లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

**అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా**

రాయికల్ మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణానికి రూ.2.10 కోట్లు మంజూరు చేయగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పది ఎకరాల స్థలంలో అయిదెకరాలు కేటాయించి 16 ఫిబ్రవరి 2014న పను ప్రారంభించారు. ఈ నిధులతో క్రికెట్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్, కబడ్డీ, కోకో వంటి అవుట్‌డోర్ క్రీడలతోపాటు బాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, చెస్, క్యారమ్ వంటి ఇండోర్ క్రీడలు ఆడేందుకు వీలుగా స్టేడియాన్ని నిర్మించాలి. స్టేడియంలో 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కేవలం 60 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. అయిదేళ్లుగా పనులు నిలిచిపోవడంతో అసంపూర్తి భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి.

**కలగానే మిగిలింది..**

ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం కలగానే మిగిలింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మినీ స్టేడియం నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ.కోటి నిధులు ప్రత్యేక అభివృద్ధి గ్రాంటు ద్వారా మంజూరు చేసింది. టెండర్ల సమయంలో ఎన్నికలు రావడంతో నిలిచి పోయింది. కళాశాల మైదానంలో వందలాది మంది విద్యార్థులు, క్రీడాకారులు, యువకులు వాకింగ్ చేస్తుంటారు. ఓపెన్ జిమ్ ప్రారంభించినా పరికరాలన్నీ విరిగిపోయాయి. మరోచోట ఓపెన్ జిమ్ ఏర్పాటుకు నిర్మాణ పనులు ప్రారంభించినా మధ్యలోనే నిలిచిపోయాయి.

**అలంకారప్రాయంగా..**

జగిత్యాల పట్టణంలో క్రీడాభివృద్ధి శాఖ పదేళ్ల కిందట రూ.2.10 కోట్లతో ఏర్పాటు చేసిన శ్రీవివేకానంద మినీ స్టేడీయం క్రీడా వసతులు, సౌకర్యాలు లేక అలంకారప్రాయంగా మారింది. శిక్షకుల నియామకం లేక ఈత కొలను శిథిలావస్థకు చేరుకుంటుండగా ఇటీవల విద్యుత్తు దీపాల ఏర్పాటుతో అందుబాటులోకి వచ్చిన షటిల్ బాడ్మింటన్ కోర్టులది ఇదే పరిస్థితి. స్టేడియం ఆవరణలో తాత్కాలికంగా వెలిసిన షెడ్ల స్థానంలో దుకాణ సముదాయం నిర్మిస్తే రూ.లక్షల్లో సమకూరే ఆదాయం ద్వారా క్రీడల అభివృద్ధికి అవకాశం ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోకపోవడం క్రీడాకారులకు శాపంగా మారింది.

# చలిలోనూ పెరిగిన విద్యుత్తు వినియోగం

హైదరాబాద్: రాష్ట్రంలో చలి గజగజ వణికిస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడం, శీతలగాలులు వీస్తుండటంతో వాతావరణం పొడిగా మారింది. దీంతో విద్యుత్తు డిమాండ్ తక్కువగా ఉంటుందనే అంచనాలకు భిన్నంగా రాష్ట్రంలో కొద్దిరోజులుగా పెరిగింది. గతేడాది నవంబరు 26న 9170 మెగావాట్ల డిమాండ్ ఉంటే.. ఈసారి 10698 మెగావాట్లకు పెరిగింది. గతేడాది నవంబరు 27న 9387 మెగావాట్ల డిమాండ్ నమోదైతే... ఈ ఏడాది ఇదే రోజు 10843 మెగావాట్ల డిమాండ్ రికార్డైంది. వినియోగం డబుల్ సెంచరీ దాటింది.. ఈ నెల 26, 27 తేదీల్లో 200.83, 200.80 మిలియన్ యూనిట్ల వినియోగం రాష్ట్రంలో నమోదైంది.

గతేడాది ఇవే రోజుల్లో 192.37, 195.97 మిలియన్ యూనిట్లు మాత్రమే నమోదైంది. హైదరాబాద్‌లోనూ..విద్యుత్తు డిమాండ్ గతేడాది నవంబరు 26న 2535 మెగావాట్లు ఉండగా.. ఈసారి 2973 మెగావాట్లకు పెరిగింది. నవంబరు 27న గతేడాది 2835 మెగావాట్లు నమోదు కాగా.. ఈసారి 3001 మెగావాట్లకు పెరిగింది. వినియోగంలోనూ పెరుగుదల నమోదైంది. 2023 నవంబరు 26న 49.57 మిలియన్ యూనిట్లు, నవంబరు 27న 53.56 మి.యూ. నమోదైంది. ఈ ఏడాదికి అవే రోజుల్లో 56.56, 56.06 మిలియన్ యూనిట్లు రికార్డైంది. కారణాలేమై ఉంటాయ్... రాష్ట్రంలో గతేడాదితో పోలిస్తే విద్యుత్తు కనెక్షన్ల సంఖ్య పెరగడం, పరిశ్రమల పరంగా వాడకం, ఉదయం పూట ఇళ్లలో గీజర్ల వినియోగం అధికమవడం వంటి కారణాలతో విద్యుత్తు డిమాండ్ మునుపటి ఏడాది కంటే ఎక్కువగా ఉందని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు అన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ





శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం తరపున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా శామీర్ పేట కు చెందిన దప్పు పెద్దబాబు- రమా దంపతులు 25 కేజీల బియ్యం అందజేశారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# రేషన్ కార్డుల సర్వేకు ప్రజలు తప్పక సహకరించాలి : మున్సిపల్ కమిషనర్

శామీర్ పేట, (గరుడ వార్త) : రేషన్ కార్డ్ సర్వేకు తూముకుంట మున్సిపల్ ప్రజల సహకరించాలని కమిషనర్ వెంకట గోపాల్ కోరారు. బుధవారం శామీర్ పేట మండలం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని వార్డులలో రేషన్ కార్డుల సర్వే మొదలవుతుందని తెలిపారు. ఇట్టి సర్వేకు మున్సిపల్ నుంచి వార్డు ఆఫీసర్లు, రెవిన్యూ విభాగము నుంచి వెరిఫికేషన్ ఆఫీసర్లు వస్తారని చెప్పారు.



ఇప్పటికే ప్రభుత్వము నుంచి పొందిన జాబితా లోని అర్హులను గుర్తించి వారి వివరములు నమోదు చేయనున్నట్లు తెలిపారు. వార్డుల్లో సభలు ఏర్పాటు చేసి అర్హులైన వారి జాబితాను ఆమోదించి తిరిగి ప్రభుత్వానికి అందజేయ నున్నట్లు చెప్పారు. ఈ విషయమై సర్వే కి వచ్చే సిబ్బందికి మున్సిపల్ ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

# పల్లె పాలనపై నిర్లక్ష్యం!

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగియడంతో పంచాయతీల నిర్వహణ బాధ్యతలు ప్రభుత్వం ప్రత్యేకాధికారులకు అప్పగించింది. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో గ్రామాల్లో రోడ్లపై పిచ్చిమొక్కలు పెరిగి, మురుగుకాల్వలు శుభ్రం చేయకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై దృష్టిసారించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

**దోమల స్వైరవిహారం**

గ్రామాల్లో ప్రత్యేకాధికారులు శ్రద్ధ చూపకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ లోపం కనిపిస్తోంది. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టిన అధికారులు గ్రామాల్లో పరిశుభ్రతను విస్మరిస్తున్నారు. మండల కేంద్రంలో చిలుకవాగులో మురుగు ప్రవహిస్తుండటంతో గ్రామస్థులు, ముఖ్యంగా ఎస్సీ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాల్లో మురుగుకాల్వలు శుభ్రం, రహదారుల వెంబడి పిచ్చిమొక్కలను శుభ్రం చేయకపోవడంతో దోమలు, దుర్వాసన వెదజల్లుతోంది.- న్యూస్‌టుడే, కొడిమ్యాల

**మురుగుతో దుర్వాసన**


గ్రామాల్లో వార్డులకు సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో చెత్త సేకరణ, మురుగు కాల్వలు తీయక పోవడంతో అపరిశుభ్రంగా మారుతున్నాయి. పలు గ్రామాల్లో మురుగు కాల్వలు గతంలో నిర్మించినవే కావడంతో చాలా చిన్నవిగా ఉండి చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. గ్రామశివారులోని కాలనీల్లో మురుగు కాల్వలను నిర్మించకపోవడంతో రహదారులపై మురుగు ప్రవహించడంతో పాటు నిల్వ ఉంటుండడంతో దుర్వాసన వెదజల్లి, దోమల వ్యాప్తి చెందుతున్నాయి. గ్రామాల్లో ప్రధాన రహదారుల పక్కనే చెత్తను పడేస్తున్నారు.

**కాలువ పూడ్చివేత..** మండలంలోని పలుగ్రామాల్లో మురుగు కాలువల నిర్వహణ సక్రమంగాలేక గ్రామస్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. మండల కేంద్రంలో అతిపెద్ద మురుగు కాలువ జగ్గని ఒర్రెలో ప్లాస్టిక్ వ్యర్థాలతోపాటు చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

ఎస్సీ కాలనీలోని ఓ వీధిలో కాలువ అసంపూర్తిగా నిర్మించడంతో మురుగు రోడ్డుపైకి ప్రవహిస్తుందని కాలనీవాసులు తెలిపారు. కొండగట్టు దిగువ ప్రాంతంలో వనభోజనాల కు వచ్చే యాత్రికులతో చెత్తాచెదారం పేరుకుపోతుంది. మల్యాల అడ్డరోడ్డు వద్ద కొందరు కాలువను పూడ్చివేయడంతో మురుగు నీరు వెళ్లడంలేదు.

# ధరణి వినతుల పరిష్కారంపై దృష్టి..!

ఎనిమిదేళ్లుగా భూ సమస్యలతో సతమతమవుతున్న రైతుల ఇబ్బందులు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ చేపడుతోంది. కొత్తగా భూభారతి చట్టం(ఆర్వోఆర్)-24కు రూపకల్పన చేసింది. గతంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లాల అధికార, రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. గతంలో ధరణి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు వెలుగు చూశాయి. కొత్త చట్టం రూపకల్పన నేపథ్యంలో రైతులు తమ పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతాయనే ఉద్దేశంతో ఇటీవల అర్జీలు సమర్పించడం లేదు. గతంలో రోజుకు 100 వరకు దరఖాస్తులు వస్తే కొత్త చట్టం రూపకల్పన ప్రకటన తర్వాత పదుల సంఖ్యలోనే వస్తున్నాయి. కలెక్టర్ నుంచి తహసీల్దార్ వరకు ప్రత్యేక దృష్టి ధరణి పోర్టల్‌లో తహసీల్దార్, ఆర్డీవో, అదనపు పాలనాధికారి(రెవెన్యూ), కలెక్టర్‌లకు లాగిన్ సౌకర్యం కల్పించి సమస్యలు పరిష్కరించే బాధ్యతలు



అప్పగించారు. మరో వారంలో ధరణి పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కరించాలనే లక్ష్యంతో రెవెన్యూ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. డిజిటల్ పట్టాదారు పాస్‌పుస్తకాల్లో పేరు మార్పిడితో పాటు తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో సమస్యలను ఒకట్రెండు రోజుల్లోనే పరిష్కరిస్తున్నారు. గతంలో వీటికి నెల నుంచి రెండు నెలల సమయం పట్టేది. ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని మూడు జిల్లాల పాలనాధికారులు చెబుతున్నారు. గురువారం నాటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,064 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకరోజులో మొత్తం 130 దరఖాస్తులు రాగా ఇందులో 96 దరఖాస్తులను పరిష్కరించినట్లు అధికారులు పేర్కొన్నారు.

# పల్లెల్లో పనుల జాతర

చేగుంట: రైతులకు సంబంధించిన పనులు చేపట్టేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ సన్నద్ధమైంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేయనున్నారు. 'పనుల జాతర' పేరిట ప్రణాళిక సిద్ధం చేశారు. మార్చి చివరిలోగా వీటిని పూర్తిచేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇందుకు జిల్లాకు రూ.50 కోట్లు మంజూరు చేశారు. వీటిలో రైతులకు జల సంరక్షణ పనులతో పాటు కర్షకుల పొలాలకు వెళ్లేందుకు ఉన్న కాలిబాటలను బాగు చేసేందుకు నిర్ణయించారు.

**అన్ని మండలాల్లో..**జిల్లాలోని 21 మండలాల్లో 493 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలతో పాటు దుబ్బాక, గజ్వేల్, నారాయణఖేడ్, ఆందోల్ నియోజకవర్గాలకు చెందిన పలు మండలాలు ఉన్నాయి. అన్నింటికీ జాతీయ గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. ఎట్టి పరిస్థితుల్లో మార్చి 31లోగా పనులు పూర్తి అయ్యేలా చేపడుతున్నారు.

**రైతులకు ఎంతో మేలు - శ్రీనివాస్‌రావు, డీఆర్డీవో**

పనుల జాతర వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. మూడు నెలల్లో పూర్తిచేసి వినియోగించే విధంగా చూస్తున్నాం. ఇందుకోసం గ్రామాల్లో పనులు కూడా గుర్తించాం. పెద్ద ఎత్తున నిధులు ఉండటంతో పూర్తి స్థాయిలో అభివృద్ధి జరిగే ఆస్కారం ఉంది.

**ఉపయోగపడే పనులు**

రైతులకు ఉపయోగపడే పనులు ఇందులో చేపడుతున్నారు. ముఖ్యంగా పశువుల షెడ్లు, కోళ్ల ఫారాలు, వర్మీ కంపోస్టు తయారీ పనులు, నాడెపు కంపోస్టు పిట్, అజోల తయారీ యూనిట్, ఇంకుడు గుంతలు, జలనిధి ద్వారా చెక్‌డ్యాంల నిర్మాణం, వ్యవసాయ బావులు, వర్షం నీటిని ఒడిసిపట్టే నిర్మాణాలు, అంగన్‌వాడీ భవనాలు, సీసీదారులు, గతంలో ఉపాధి హామీ పథకంలో నిర్మించిన రోడ్లపై మట్టిని వేయటం వంటివి చేపట్టనున్నారు. అంతేకాకుండా ప్రత్యేకంగా పొలాల వద్దకు ఉన్న కాలిబాటలను అభివృద్ధి చేయనున్నారు. దీనివల్ల రైతులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. చేపట్టే ప్రతి పని కూడా పూర్తిగా రైతులకు ఉపయోగపడే విధంగా ఉండటంవల్ల వారు సంతోషంగా ఉన్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో పనులు గుర్తించే విధంగా అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. నిధులు పుష్కలంగా ఉండటంతో త్వరితగతిన పూర్తిచేసి మేలు చేసే విధంగా చూస్తున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే ఒక్కో పనిని పూర్తిచేశారు.

# నవీన విద్యకు నవోదయ దారి

కాగజ్‌నగర్: మేటి సంస్థల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌లో చదవాలనుందా.. ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదా.. అయితే ఆరు నుంచి ప్లస్ టూ వరకు ఉచితంగా చదువుకునే అవకాశం జవహర్ నవోదయ విద్యాలయాలు కల్పిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాకు కలిపి కాగజ్‌నగర్‌లో నవోదయ విద్యాలయం ఉంది. 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో 80 సీట్లలో చేరేందుకు ఈ నెల 18న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో 24 పరీక్ష కేంద్రాల్లో 5,191 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరగనుంది.

**ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు**

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో నవోదయ అధికారిక వెబ్‌సైట్‌లో పొందవచ్చు. నవోదయ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌కు వెళ్లి రిజిస్ట్రేషన్ నెంబర్, పుట్టిన తేదీ నమోదు చేసి హాల్‌టికెట్ పొందవచ్చు. పరీక్షకు సంబంధించిన మెటీరియల్, పాత ప్రశ్నపత్రాలు సైతం అందుబాటులో ఉంటాయి.

చదవాల్సినవి.. ఆబ్జెక్టివ్ విధానంలో రెండు గంటల పాటు పరీక్ష ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ, అర్థమెటిక్, లాంగ్వేజ్ విభాగాల నుంచి 100 మార్కులకు గానూ 80 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌లో 40 ప్రశ్నలు అడుగుతారు. వీటికి 50 మార్కులు. అర్థమెటిక్ టెస్ట్, లాంగ్వేజ్ టెస్టుల్లో ఒక్కో దానికి 20 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో విభాగానికి 25 మార్కులు కేటాయించారు. మెంటల్ ఎబిలిటీ టెస్టుకు గంట సమయం. అర్థమెటిక్, లాంగ్వేజ్ టెస్టుకు అరగంట చొప్పున సమయం కేటాయించారు.

చదువుతోపాటు ఇతర అంశాల్లోనూ విద్యాలయంలో చదువుతోపాటు విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా క్రీడలు, చిత్రలేఖనం, సంగీతం, యోగా, కరాటే వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. చిన్నతనం నుంచే క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం అలవాటు పడేలా స్కౌట్స్, ఎన్‌సీసీ నిర్వహిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతోంది

# అభయం.. లక్ష్యం దిశగా పయనం



వికారాబాద్ : ఇంటర్ పరీక్షల సమయం దగ్గర పడుతోంది. కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు. పరీక్షలంటే విద్యార్థుల్లో ఒక రకమైన భయం నెలకొంటుంది. దాన్ని అధిగమించాలంటే ప్రణాళికతో ముందుకు సాగాలి. మానసిక, శారీరకంగా దృఢంగా ఉండాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు 81 ఉన్నాయి. వాటిలో 13,200 మంది విద్యార్థులు చదువుతున్నారు.సీనియర్ అధ్యాపకులు, మానసిక నిపుణుల సూచనలు..: పాఠాలు ఎప్పటికప్పుడు చదివితే ఆందోళన అవసరం లేదు. ఏడాదంతా సరదాగా గడిపి పరీక్షల వేళ తొందరపడి అన్ని పాఠ్యాంశాలు చదివితే ఉపయోగం ఉండదు. సమయపాలన, ప్రణాళిక చాలా అవసరం. ఇప్పట్నుంచే పాఠ్యాంశాల్లోని ముఖ్య విషయాలు, ప్రశ్నల సరళి, మార్కుల కేటాయింపుపై అవగాహన పెంచుకోవాలి. గత ప్రశ్నాపత్రాలను సాధన చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక వేసుకోవాలి. రోజుకు ఎన్ని పాఠ్యాంశాలు చదవాలి.. వారంలో ఎన్నింటిని పూర్తి చేయలన్నది నిర్దేశించుకోవాలి. దైనందిన అవసరాలకు సమయం కుదించి ఏకాగ్రతతో చదువుకోవాలి. పాఠ్యాంశాలను చదివేందుకు పునశ్చరణకు సమయాలను వేర్వేరుగా నిర్ధారించుకోవాలి. సందేహాలను అధ్యాపకులను అడిగి నివృత్తి చేసుకోవాలి. ఏకధాటిగా చదవకుండా ప్రతి గంటకు 5-10 నిమిషాలు విరామం తీసుకోవాలి. పరీక్షల వేళ విద్యార్థులకు సమతుల ఆహారం అవసరం. ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ ఉండే ఆహారం తీసుకోవాలి. తగినంత నీరు తాగాలి. ఆహారంలో పండ్లు భాగం చేసుకోవాలి. పరీక్షలు పూర్తయ్యే వరకు మాంసాహారం, కొవ్వు పదార్థాలు, మసాలాలు, జంక్‌ఫుడ్, బయటి ఆహారానికి దూరంగా ఉండడం మేలు. నిత్యం కనీసం 6- 8 గంటల నిద్ర అవసరం. ఉదయం, సాయంత్రం కాసేపు ధ్యానం, ప్రాణాయామం సాధన చేయాలి. చరవాణుల వినియోగాన్ని తగ్గించాలి. భావోద్వేగాలను కలిగించే సీరియళ్లు, సినిమాలు చూడొద్దు. విందులు, వేడుకలకు దూరంగా ఉండడం మంచిది.

కళాశాలల సమాచారం..

జిల్లాలో జూనియర్ కళాశాలలు: 81

ప్రభుత్వ: 13

ప్రైవేటు: 23

యాజమాన్యం: 45

తల్లిదండ్రుల పాత్ర ముఖ్యం..

పరీక్షల వేళ పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. పరీక్షల వేళ విద్యార్థుల్లో ఒత్తిడి సహజం. దాన్ని జయించాలి. చదువుకునే గది ప్రశాంతంగా ఉండాలి. ధైర్యం కోల్పోకుండా నమ్మకంతో ఉండాలి.డా.ఎం.సాయిప్రశాంతి, మానసిక నిపుణురాలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వికారాబాద్.

# మెలకువలు నేర్పించి.. సాగు విస్తీర్ణం పెంచి



ధారూర్: వనరులను సద్వినియోగం చేసుకొని మంచి దిగుబడులు సాదించేలా కృషి చేస్తోంది భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ. 2017లో ఫార్మర్ ఫస్ట్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గట్టెపల్లి, గురుదోట్ల, రాంపూర్, అంపల్లిని దత్తత తీసుకున్నారు. అన్ని గ్రామాల్లో కలిపి 787 మంది రైతులను గుర్తించి సంఘాలుగా ఏర్పాటు చేశారు.


**అన్నదాతలకు అవగాహన..**

వ్యవసాయశాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో రైతులకు వివిధ రకాల పంటల సాగుపై అవగాహన కల్పించారు. విత్తనాల ఎంపిక, నేల స్వభావాన్నిబట్టి సకాలంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకోవడంతో పెట్టుబడులు తక్కువ కావడమే కాకుండా మంచి దిగుబడులు సాధించే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందించారు. స్థానిక వనరులను సద్వినియోగం చేసుకొని రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నారు. ప్రారంభంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించారు. అందిపుచ్చుకున్న రైతులు గతంలో కంటే ఎక్కువ విస్తీర్ణంలో వేరుశనగ, కంది, పెసర, మినుము వంటి పంటలు సాగు చేస్తున్నారు. కొందరు వారి పొలంలో పండించిన పంటనుంచే నాణ్యమైన విత్తనాలను సేకరించి సాగుచేస్తున్నారు. మరి కొందరు విపణుల్లో లభించే మేలైన విత్తనాలను తెచ్చుకొని పండిస్తున్నారు. సకాలంలో ఎరువులు, సస్యరక్షణ చర్యలు, క్రిమి సంహారక మందులను పిచికారీ చేసి మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

**ప్రస్తుతం సాగు ఇలా..**

రాంపూర్‌లో వానాకాలంలో 250 ఎకరాల్లో వరి, 270 ఎకరాల్లో పెసర, 100 ఎకరాల్లో కంది పంట, యాసంగిలో 300 ఎకరాల్లో వేరుశనగ పంట సాగుచేశారు. గట్టెపల్లిలో 500 ఎకరాల్లో వరి, 100 ఎకరాల్లో పెసర, 50 ఎకరాల్లో కంది, 120 ఎకరాల్లో వేరుశనగ వేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. అంపల్లి, గురుదోట్లలో 550 ఎకరాల్లో వరి, 110 ఎకరాల్లో పెసర, 100 ఎకరాల్లో కంది, 120 ఎకరాల్లో వేరుశనగ సాగైనట్లు అధికారులు తెలిపారు.

# పాఠ్యపుస్తకం.. కంప్యూటర్ శిక్షణ



హైదరాబాద్: కంప్యూటర్లు.. ల్యాప్‌టాప్‌లు... డిజిటల్ తెరలపై పాఠాలు చెబుతున్న ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలకు దీటుగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. 'కోడింగ్' నేర్పిస్తున్నారు. కళాశాల స్థాయిలో నేర్చుకునే కోడింగ్‌ను ఐదు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు నేర్పుతున్నారు. కామిక్ సిరీస్‌లు, కార్టూన్ నెట్‌వర్క్‌లలోని పాత్రలను వారితోనే తయారు చేయిస్తున్నారు. ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు సహకారం అందిస్తున్నాయి. ఆయా సంస్థలు ఎంపిక చేసిన పాఠశాలలకు డెస్క్‌టాప్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఐప్యాడ్‌లను ఉచితంగా ఇస్తుండగా... ఐటీ సంస్థల ఉద్యోగులు, యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చి విద్యార్థులకు ఉచితంగా పాఠాలు చెబుతున్నారు..

**సులువుగా అర్థం చేసుకునేలా...**

డెస్క్‌టాప్ కంప్యూటర్, ల్యాప్‌టాప్, ఐప్యాడ్‌లను సులువుగా వినియోగించేలా... అందులోని సాంకేతిక పదాలు, భాషను అర్థం చేసుకునేలా విద్యార్థులకు ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ప్రోగ్రామ్‌లు ఎలా రూపొందించాలో ప్రయోగాత్మంగా వివరిస్తున్నారు. సర్కారు బడుల విద్యార్థుల ఇళ్లల్లో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు ఉండవు. అందుకే విద్యార్థులకు చరవాణితో గేమ్‌లు రూపొందిస్తున్నారు. కొద్దిరోజులు వారిని గేమ్స్ ఆడించాక... మీరే సొంతంగా గేమ్స్ రూపొందించండి అంటూ విద్యార్థులకు చెబుతున్నారు. దీంతో చాలామంది విద్యార్థులు తమకు నచ్చిన గేమ్‌ను తయారు చేసేందుకు కోడింగ్ ఉపయోగిస్తున్నారు. తొంభైశాతం మంది విద్యార్థులు కోడింగ్‌ను ఆడుతూపాడుతూ నేర్చుకుంటున్నారని కూకట్‌పల్లి, మహబూబియా ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతోపాటు కంప్యూటర్లు లేని పాఠశాలల్లో 'సింక్రోనీ' సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన కిట్ ద్వారా చార్టులతోనే కోడింగ్ నేర్పిస్తోంది.

సొంతంగా పేర్లు..కంప్యూటర్ గేమ్‌లో పాత్రధారులకు విద్యార్థులు సొంతంగా పేర్లు పెడుతున్నారు. తెలుగు, హిందీ, ఆంగ్లభాషలకు సరిపోయేలా పేర్లను తయారు చేస్తున్నారు. శిక్షణతో పాటు వీరికి సమాచార నైపుణ్యాలు నేర్పిస్తున్నారు. కోడింగ్ నేర్చుకుంటున్నకొద్దీ విద్యార్థుల్లో వారికి తెలియకుండానే తార్కికజ్ఞానం పెరుగుతుంది. ఆటలు రూపొందించేటప్పుడు వారి ఆలోచన పరిధి విస్తృతమవుతోంది.

## పర్యవేక్షణ లేమి.. రేషన్ పక్కదారి

హైదరాబాద్: నగరంలో 6.39 లక్షల కార్డు దారులకు నిత్యావసర సరకులను నెల నెలా అందించే నగర పౌర సరఫరాల శాఖలో కీలక పోస్టులు భర్తీ చేయకపోవడంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. నగరంలో 66 డీలర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రేషనింగ్ అధికారి (సీఆర్ఓ) పరిధిలో 18 మంది డిప్యూటీ తహసీల్దార్‌ల పోస్టులు ఉండగా ప్రస్తుతం తొమ్మిది మంది మాత్రమే విధుల్లో ఉన్నారు.60 మంది సీనియర్ చెకింగ్ ఇన్స్‌పెక్టర్లు ఉండాల్సి ఉండగా.. 28 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.జూనియర్ ఎంక్వయిరీ ఇన్స్‌పెక్టర్లు 41 మంది ఉండాల్సి ఉండగా.. 22 మంది మాత్రమే ఉన్నారు.కీలకమైన పోస్టులతో పాటు పరిపాలనా పరంగా విధులు నిర్వహించే పలు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. సీఆర్వో పరిధిలో గతంలో ఎప్పుడో నిర్ణయించిన ఉద్యోగుల సంఖ్యలోనూ భారీగా ఖాళీలు ఉన్నాయి.

# విలీన గ్రామాల ఆశలు ఆవిరి

గజ్వేల్ : గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటి పరిధిలోని విలీన గ్రామాల్లో ఫేజ్-2 కింద చేపట్టాల్సిన యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు ఇప్పట్లో అయ్యేలా కనిపించటం లేదు. పాలకమండలి ప్రతిపాదించిన దాదాపు రూ.49 కోట్ల నిధులకు సబంధించి ఇప్పటిదాకా ఎలాంటి పురోగతి లేదు. ఈనెల 26 తో ప్రస్తుత మున్సిపాలిటీ పాలక మండలి పదవీకాలం ముగిసిపోతుండటంతో ఇక నిధుల కృషి, పనుల విషయం మరుగునపడినట్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ గ్రామాల్లో మొత్తం 40 కిలోమీటర్ల మేర పైపులైన్లు నిర్మించాలని ప్రతిపాదించారు. పనులు చేపట్ట లేదు.

2020లో పనుల ప్రారంభం

దోమలు, మురుగు వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విలీన గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మున్సిపాలిటిలో ఫేజ్-1 కింద 138 కిలోమీటర్ల మేర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయటంతో పాటు నాలుగు చోట్ల మురుగునీటి శుద్ధిప్లాంట్లు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు రూ.99 కోట్ల అంచనా వ్యయంతో 2020లో పనులు ప్రారంభించారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ పట్టణాల పరిధిలో పనులు చేపట్టారు. కరోనా కారణంగా పనుల్లో జాప్యం నెలకొని పైపులైన్ల ఏర్పాటు పూర్తికాకపోవటం, చాలా చోట్ల ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వకపోటంతో సమస్యకు కారణమైంది.



**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం..- రాజమౌళి, మున్సిపాలిటీ ఛైర్మన్**

బల్దియా బాగు కోసం గత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించటంతో అభివృద్ధి చేశాం. మిగిలిన పనుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయాం. నిధులు మంజూరు అవుతాయని ఆశించాం. మరో రూ.50 కోట్లు కేటాయిస్తే పూర్తిస్థాయిలో యూజీడీ పనులు పూర్తవనున్నాయి.

**మురుగు తొలగించే యంత్రాలు కరవు**

చేసేదేమీలేక కొందరు ఇంటి యజమానులు సొంత ఖర్చుతో కనెక్షన్లు ఇచ్చుకుంటున్నారు. పట్టణంలో వైద్యుడు కుమారస్వామి రూ.10 వేలకుపైగా ఖర్చు చేసుకుని ఇంటికి యూజీడీ కనెక్షన్ ఇప్పించుకోవాల్సి వచ్చింది. కొన్ని చోట్ల పైపులైన్ల నిర్మాణం ఎత్తుపల్లాల్లో ఉందని చెబుతున్నారు. విలీన గ్రామాలైన ముట్రాజ్‌పల్లి, గుండన్నపల్లి, క్యాసారం తదితర చోట్ల ఇంకా పనులు చేపట్టలేదు. మురుగు నిలిచినపుడు తొలగించే యంత్రాలు సైతం లేవు. మున్సిపాలిటీకి అన్నిరకాల పన్నులు చెల్లిస్తున్నా.. కాలనీల్లో సౌకర్యాలు ఎందుకు ఏర్పాటు చేయటం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బల్దియాలో జనాభా - 55000 నివాసాలు - 13500

అవసరమయ్యే యూజీడీ లైను - 180 కి.మీ.

చేపట్టింది - 130 కి.మీ.

# అతివలకు ఆర్థిక వెలుగులు

సంగారెడ్డి : విద్యుత్తు వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ఇలా వినియోగిస్తూ పోతే భవిష్యత్తు తరాలకు మిగిలేది అంధకారమే. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా సౌర విద్యుత్తు ఉత్పత్తి దిశగా సాగుతోంది. 'సౌర' యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. తాజాగా ఇందిరా మహిళా శక్తి పథకం కింద పొదుపు సంఘాల సభ్యులకు సౌర యూనిట్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**సాగుకు యోగ్యం కాని భూముల్లో..**

గ్రామాల్లో సాగుకు యోగ్యంకాని భూములు జిల్లాలో వందలాది ఎకరాలు ఉంటాయి. అలాంటి స్థలాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్లు నెలకొల్పాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ భూములు ఖాళీగా ఉంటే అక్కడా యూనిట్లు నెలకొల్పాలని భావిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ భూమి రక్షించినట్లు అవుతుంది. ముందుకు వచ్చే మహిళా సంఘాల సభ్యులకు పీఎం కుసుమ్ యోజన కింద యూనిట్ నెలకొల్పేందుకు తీసుకునే రుణాలపై వడ్డీ రాయితీ సదుపాయం ఉంటుంది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఎంపిక చేసిన మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయించనున్నారు. స్త్రీనిధి, సెర్ప్, బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. గ్రామైక్య సంఘం, మండల, జిల్లా సమాఖ్యల్లో నిధులు ఉంటే వాటి నుంచి కూడా సంఘాల సభ్యులకు రుణాలు ఇప్పిస్తారు. ఒక మెగావాట్ యూనిట్ ఏర్పాటుకు రూ.4 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. ఇందులో 10శాతం వాటాధనం పొదుపు సంఘం సభ్యులు చెల్లించాల్సి ఉంటుంది.

**విద్యుత్తు విక్రయంతో ఆదాయం**

సౌర విద్యుత్తు ప్లాంటు ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును సమీపంలోని ఉప కేంద్రానికి అనుసంధానం చేస్తారు. మెగావాట్ విద్యుత్తు యూనిట్ ఏర్పాటుతో నెలకు రూ.2.16లక్షల వరకు ఆదాయం సంపాదించేందుకు వీలుంటుంది. 25 సంవత్సరాల వరకు ఇది ఆదాయ వనరుగా ఉంటుంది. సౌర విద్యుత్తు యూనిట్ల ఏర్పాటుకు మహిళా సంఘాలు ముందుకు వచ్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మహిళా సంఘాల సభ్యులకు సౌర విద్యుత్తు ప్లాంట్లపై కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నామని డీఆర్‌డీవో జంగారెడ్డి తెలిపారు.

జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 695

మహిళా సంఘాలు: 18,213

వాటిలో సభ్యులు: 1.90లక్షలు

మెగావాట్ యూనిట్ ఏర్పాటుకు అవసరమయ్యే భూమి: 4 ఎకరాలు

పెట్టుబడి వ్యయం: రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లు

ఒక యూనిట్ ద్వారా నిత్యం విద్యుత్తు ఉత్పత్తి: 4వేల యూనిట్లు

నెలకు వచ్చే ఆదాయం: రూ.2.16 లక్షలు

# యాసంగి సజావుగా 'సాగే'నా!

పెద్దపల్లి : నీటి లభ్యత కలిగిన ప్రాంతాల్లో యాసంగి వరి నాట్లు జోరందుకున్నాయి. బావులు, చెరువులతో పాటు కాలువ ఆధారంగా రైతులు సాగు చేస్తున్నారు. యాసంగిలో నీటి విడుదలపై అధికారులు హామీ ఇవ్వడంతో సాగు విస్తీర్ణం కూడా పెరుగుతోంది. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కాలువల డ్రాపులు, తూములు దెబ్బతినడంతో నీరంతా వృథాగా పోతోంది. కాలువ చివరి ఆయకట్టుకు నీటిని అందించేందుకు అధికారుల వద్ద సరైన ప్రణాళిక లేకపోయింది.

**దిగువకు తగ్గిన ప్రవాహ వేగం**

ఎలిగేడు మండలంలో ఎస్సారెస్పీ డీ86 ప్రధాన కాల్వ డ్రాపులు, తూములు ధ్వంసమయ్యాయి. శివపల్లి సమీపంలో డ్రాప్ పాడయి ప్రవాహ వేగం తగ్గింది. శివపల్లి, లాలపల్లి, నర్సాపూర్, సుల్తానాబాద్ మండలం పూసాల, నారాయణపూర్ గ్రామాలకు నీరందకపోగా దిగువ ప్రాంతాలైన సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు వేగంగా వెళ్లడం లేదు. పలు గ్రామాలకు వెళ్లే కాలువ తూములు ధ్వంసమవడంతో పాటు కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది.

**షట్టర్లు లేక నీటి వృథా**

మండలంలోని 22 గ్రామాల పరిధిలో ఎస్సారెస్పీ ఆధారంగా 17 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయి. ఏటా



చివరి ఆయకట్టుకు నీరందక పంటలు ఎండి రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. పూడిక చేరడంతో ప్రధాన, ఉపకాలువలు చాలా చోట్ల ధ్వంసమయ్యాయి. ప్రధాన కాలువ నుంచి ఉప కాలువకు నీటి విడుదల సమయంలో తూములకు షట్టర్లు లేక నీరంతా వృథాగా పోతోంది. ప్రధాన కాలువతో పాటు మైనర్, సబ్ మైనర్ కాలువలను మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు.

**దెబ్బతిన్న సీసీ నిర్మాణాలు**

ఇప్పలపల్లి వద్ద డీ 86 పరిధిలోని 56 ఎల్ఆర్ కాలువకు సీసీ దెబ్బతింది. కాలువలో పిచ్చి మొక్కలు, పూడిక నిండి నీరు పారడం లేదు. గతేడాది నీరందక పంటలు ఎండిపోయాయి. ఈ యాసంగిలోనైనా మరమ్మతులు చేయకుంటే అదే పరిస్థితి ఎదరవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సొంత డబ్బుతో పూడిక తొలగింపు**

పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట ప్రాంతంలో డీ-83 కాలువకు పలు చోట్ల తూములు దెబ్బతిన్నాయి. పట్టణం మీదుగా వెళ్లే 22-ఆర్ కాలువ సైఫన్ వద్ద రైతులే సొంత డబ్బుతో పూడిక తొలగించారు. పెద్దకల్వల, కొత్తపల్లి, నిట్టూరు వద్ద పలు చోట్ల కాలువలు దెబ్బతిన్నాయి. వీటి మరమ్మతులు చేపట్టకపోవడంతో దిగువ ప్రాంతాలకు నీరు వెళ్లే పరిస్థితి లేదు.

**దెబ్బతిన్న చోట చేశాం..**

డి-83 కాలువ పరిధిలో కాలువలు బాగానే ఉన్నాయి. అక్కడక్కడ చిన్న చిన్న ఇబ్బందులున్నాయి. కాలువలు పెద్దగా దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేశాం.

కె.శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఈఈ

# పనుల్లో వేగంతో గడువులోగా పూర్తి

పెద్దపల్లి : పల్లెల్లో బురద దారులు, గుంతల రోడ్లకు కాలం చెల్లనుంది. శాశ్వత రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధిహామీ నిధులు కేటాయించింది. సిమెంట్ రోడ్లు, పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఏడాది కూలీల నిష్పత్తి ఆధారంగా రూ.27.77 కోట్లు మంజూరయ్యాయి. సంబంధిత పనులు మార్చిలోగా పూర్తి చేయాల్సి ఉంది. ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రతి సంవత్సరం నిధులు మంజూరైన తర్వాత పనులు చేయడానికి గడువు స్వల్పంగా ఉంటోంది. ఈసారి రెండు నెలలకు పైగా ఉండటంతో వేగం పెంచితే ప్రగతి సాకారం కానుంది.



**రూ.6.17 కోట్లతో సిమెంట్ రోడ్లు**

జిల్లాలో రూ.6.17 కోట్లతో 104 ప్రాంతాల్లో సిమెంటు రహదారులు నిర్మించనున్నారు. స్థానిక ఎమ్మెల్యేల ఆమోదంతో పనుల ఎంపిక పూర్తయింది. పాలకుర్తి 10, అంతర్గాం 7, ఎలిగేడు 8, జూలపల్లి 8, శ్రీరాంపూర్ 10, ఓదెల 11, పెద్దపల్లి 15, సుల్తానాబాద్ 12, ధర్మారం 12, మంథని 2, ముత్తారం 2, కమాన్‌పూర్ 3, రామగిరి 4 చొప్పున పనులు ఎంపిక చేశారు. గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా పనుల ఎంపికలో ప్రాధాన్యం కల్పించారు.

**6 పంచాయతీలకు సొంత గూడు**

జిల్లాలో పంచాయతీలకు పక్కా భవనాలు లేక ఆరుబయటే సభలు, సమావేశాలు నిర్వహించాల్సి వస్తోంది. ఇరుకు గదుల్లోనే కొనసాగించక తప్పడం లేదు. విలువైన దస్త్రాలకు భద్రత కరవైంది. అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో, అరకొర వసతులతో కాలం వెళ్లదీస్తున్నారు. ఒక్కో పంచాయతీ భవనానికి రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ధర్మారం మండలం లంబాడితండా, పాలకుర్తి మండలం లంబాడితండా, ఓదెల మండలం బాయమ్మపల్లి, ముత్తారం మండలం పారుపల్లి, పెద్దపల్లి మండలం రాంపెల్లి, కాల్వశ్రీరాంపూర్ మండల అంకంపల్లి గ్రామాల్లో పంచాయతీ భవనాలు నిర్మించనున్నారు. ఒక్కో చోట రూ.12 లక్షలతో 17 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మిస్తారు.

# యథావిధిగా ఆరోగ్యశ్రీ సేవలు



కరీంనగర్ : ఆరోగ్యశ్రీ సేవలు ఉమ్మడి జిల్లాలో యథావిధిగా కొనసాగడంతో రోగులు ఊపిరి పీల్చుకున్నారు. ఇన్నాళ్లు చేసిన సేవలకుగానూ కోట్ల రూపాయల బకాయిలను సర్కారు చెల్లించాల్సి ఉండటంతో ప్రైవేటు ఆస్పత్రుల యాజమన్యాలు ఇక మీద వైద్య చికిత్సనందించమని పేర్కొన్నాయి. ఈ నెల 10వ తేదీ నుంచి రోగులను తీసుకోమని ప్రకటించాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి కొంత మొత్తాన్ని విడుదల చేయడంతో నాలుగు జిల్లాల పరిధిలో శుక్రవారం సేవలు ఆగకుండా కొనసాగాయి. జగిత్యాల జిల్లాలో మాత్రం కొత్తగా రోగులను కొన్ని ఆస్పత్రుల్లో అనుమతించలేదు. ప్రభుత్వం అందించనున్న సొమ్ములో తమకే మేరకు అందుతాయనే సంశయంతో ఉన్నవారికే సేవలందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 49 ప్రైవేటు దవాఖానాల్లో ఆరోగ్యశ్రీ సదుపాయంతో పేదలు అత్యవసర వైద్యసేవల్ని పొందుతున్నారు. ఇందులో 17 ప్రభుత్వ, 32 ప్రైవేటువున్నాయి.

**రూ.వంద కోట్లకుపైగా..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గడిచిన ఏడాదిన్నర కాలంగా అందించిన సేవలకు సంబంధించి రూ.100 కోట్లకు పైగా బకాయిలను ప్రభుత్వం ఆయా ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించాల్సి ఉంది. ఇందులో కరీంనగర్ జిల్లాలోనే అత్యధికంగా 22 ఆస్పత్రులకు బకాయి ఉంది. పెద్దపల్లి జిల్లాలో ఒక ఆస్పత్రి, రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు, జగిత్యాల జిల్లాలో ఏడు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సదుపాయాలు అందుతున్నాయి. వాస్తవానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పేరొందిన ప్రైవేటు ఆస్పత్రులు 200కుపైగా ఉన్నప్పటికీ ఆరోగ్య శ్రీ సేవలకు 32 ఆస్పత్రులు మాత్రమే ముందుకొచ్చాయి. రూ.5 లక్షల స్థానంలో గడిచిన ఏడాదిగా రూ.10 లక్షల వరకు ఉచితంగా చికిత్సనందిస్తున్నాయి. మొత్తం 1,835 రకాల సేవలు అందుతున్నాయి. పెరుగుతున్న ఖర్చుల దృష్ట్యా ప్రభుత్వం ఆర్నెల్ల కిందట ధరల్ని 20శాతం పెంచింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారితోపాటు ఆయుష్మాన్ భారత్ కార్డులున్నవారికి ఈ సేవల్ని వర్తింపజేస్తున్నారు.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం

ఎలాంటి ఇబ్బంది రాకుండా సేవలందుతున్నాయి. అన్ని ఆస్పత్రుల్లో సేవల్ని ప్రత్యేకంగా పరిశీలించాం. కరీంనగర్‌లో కొత్త రోగులు కూడా ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఇటీవల కాలంలో శస్త్రచికిత్సల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రభుత్వం సేవల పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పర్యవేక్షణ పెంచుతోంది.

ఏ.విజయ్‌కుమార్, ఆరోగ్యశ్రీ మేనేజర్, ఉమ్మడి జిల్లా

**చెల్లిస్తేనే మేలు**

పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లిస్తేనే మాకు మేలు జరుగుతుంది. ఇప్పటి వరకు అందించిన సేవల్లో దాదాపుగా 85 శాతం బకాయిలు రావాల్సి ఉంది. శస్త్రచికిత్సల్లో వినియోగించే పరికరాల ధరలు పెరిగాయి. ఎప్పటికప్పుడు చెల్లిస్తే మాకు కూడా పేదలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు వెసులుబాటు ఉంటుంది.

డాక్టర్, నరహరి, ఎముకల వైద్య నిపుణులు, జగిత్యాల

# అంతంత మాత్రంగానే ఎల్ఆర్ఎస్



కరీంనగర్ : జిల్లాలోని పంచాయతీలు, పురపాలికలు, పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో లేఅవుట్ల క్రమబద్ధీకరణకు(ఎల్ఆర్ఎస్) పరిష్కార ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. రెండు నెలలుగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే కారణంగా ఉద్యోగులకు ఆ బాధ్యతలు అప్పగించడంతో ఈ వైపు చూసే వారు కరవయ్యారు. ఖాళీ స్థలాలను పరిశీలన చేసి సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తప్పడం లేదు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసిన వారు ఆసక్తి చూపించడం లేదు. పట్టణ ప్రణాళిక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అర్జీదారులకు ఫోన్లు చేసి స్థలాలు చూపించాలని కోరుతున్నా పట్టించుకోవడంలేదు. సంక్షిప్త సమాచారం ద్వారా ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరించుకోవాలని, డాక్యుమెంట్లు నమోదు చేయాలని సూచించినా ఫలితం లేకుండా పోతుంది. మరో వైపు ఆసక్తి ఉన్న వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగా అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండటంలేదు. నగరంతోపాటు తిమ్మాపూర్, కొత్తపల్లి, కరీంనగర్ గ్రామీణ మండలాల నుంచి అధిక దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు సుమారు 2 వేల అర్జీలను పరిశీలించారు. అన్ని సవ్యంగా ఉన్న వాటికి ఫీజు చెల్లించాలని సమాచారం ఇస్తుండగా సగం మంది మొగ్గు చూపడం లేదు.

**మూడు శాఖల అనుమతి రావాల్సిందే..**

ఎల్ఆర్ఎస్‌కు ప్రయత్నిస్తే మూడు శాఖల అనుమతి కోసం వేచి చూడాల్సి వస్తోంది. కార్పొరేషన్, పురపాలికల్లో పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, నీటి పారుదల శాఖ విభాగాల పరిశీలన తప్పనిసరిగా మారింది. టౌన్‌ప్లానింగ్ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నారు. రెవెన్యూ ఉద్యోగులు ఆ స్థలం వివాదాస్పదంగా ఉందా? కేసులు ఉన్నాయా? ప్రభుత్వానిదా? ప్రైవేటుదా నిర్ధారించాలి. ఇరిగేషన్ ఉద్యోగులు క్రమబద్ధీకరించే స్థలం చెరువులు, డ్యాంలు, నీటి పారుదలకు సంబంధించినవేనా? కాదా చూస్తున్నారు. ఆ శాఖలన్నీ తిరిగి వచ్చే సరికి 15 రోజుల సమయం పడుతుంది.

**నిషేధిత స్థలాలపై నిర్ణయమేదీ?**

నగరంతోపాటు పురపాలికలు, పంచాయతీల పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసిన స్థలాలు నిషేధిత జాబితాలో ఉన్నాయి. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోనే 9,467, పంచాయతీల్లో 341, పురపాలికల్లో 1,956, సుడా పరిధిలో 2,770 అర్జీలు పక్కన పెట్టారు. నగరంలో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలం కూడా నిషేధిత జాబితాలో చేరింది. అక్కడ చెరువులు, కుంటలు లేకపోగా అబాది ఉన్న చోట ఇలాంటి పరిస్థితి ఎదురుకావడంతో చివరకు ఎల్ఆర్ఎస్ వద్దనే పరిస్థితి వచ్చింది. ఒక సర్వే నంబర్‌లో ఏ ఒక్క చోట అయినా కోర్టు కేసు ఉన్నా నిషేధిత జాబితాలో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అర్జీదారు రిజిస్ట్రేషన్ శాఖకు వెళ్లి రాతపూర్వకంగా దరఖాస్తు చేస్తే అందుల్లోంచి తీసి వేస్తారని చెబుతుండగా, అక్కడి వరకు ఎందుకు వెళ్లాలనే ఆలోచనలో కొందరు ఉన్నారు.

# రచనలతో సామాజిక చైతన్యం



సిరిసిల్ల : సామాజిక, వర్ధమాన అంశాలే కథా వస్తువులుగా సిరిసిల్లకు చెందిన పలువురు కవులు, కవయిత్రులు రచనలు చేస్తున్నారు. సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న అంశాలు, మనుషులు, వారి స్వభావాలు తదితర అంశాలపై రచనలు చేస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

**వచన కవిత్వంతో... ఎలగొండ రవి**

సిరిసిల్లకు చెందిన ఎలగొండ రవి తన రచనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పదో తరగతి వరకు సిరిసిల్లలోని యూపీఎస్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, హైదరాబాద్‌లో డిప్లొమా, డిగ్రీ పూర్తి చేశారు. ప్రస్తుతం సిరిసిల్లలోని గీతానగర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. సామాజిక, వర్ధమాన అంశాలపై వచన కవిత్వం చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల నుంచే రచనలు చేయడం ప్రారంభించారు. చలం, తిలక్ రచనలు తనను ఎక్కువగా ప్రభావితం చేశాయని చెబుతారు రవి. కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారం, బీఎస్ రాములు పురస్కారం అందుకున్నారు. ఖడ్గధార, సముద్రం, 'జీవితం పియానో మెట్ల మీద' అనే పుస్తకాలు రచించారు.

**గేయ రచయిత్రిగా...**సుమన చక్రవర్తి

సిరిసిల్లకు చెందిన కూన సుమన చక్రవర్తి బీటెక్ పూర్తి చేశారు. భర్త వీరవేణి మధు ఆర్మీలో పని చేస్తారు. పాఠశాల, కళాశాల స్థాయి నుంచే సాహిత్యంపై ఆసక్తి పెంచుకున్న సుమన బీటెక్ చదివే రోజుల్లోనే పుస్తకాలు రచించడం ప్రారంభించారు. నాలోని భావం, వరంగల్ కవయిత్రులు, కవితా మేఘమాల పుస్తకాలు రాశారు. 2021 సంవత్సరంలో ప్రపంచ మహిళా తెలుగు కవిత మహోత్సవంలో 250 కవయిత్రులతో కలిసి పాల్గొని ప్రశంసలు అందుకున్నారు. వంశీ గ్లోబల్ పురస్కారం, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అందుకున్నారు. ఓవైపు రచనలు, యూట్యూబ్‌లోని ఆల్బమ్‌లకు గేయ రచయిత్రిగా పని చేస్తూనే సామాజిక సేవలోనూ ముందుంటున్నారు.

**పుస్తకాలు చదువుతూ... సుంక ధరణి**

సిరిసిల్లకు చెందిన సుంక ధరణి పుస్తకాలు చదువుతూ, రచనలు చేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఎమ్మెస్సీ పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఆమె తల్లి సుంక లత బీడీలు చుడుతారు. తండ్రి నర్సయ్య మరమగ్గాల కార్మికుడు. ధరణికి చిన్నతనం నుంచే సాహిత్యం, పుస్తక పఠనంపై అభిరుచి ఎక్కువ. శ్రీశ్రీ మహాప్రస్థానం, డా.సి.నారాయణరెడ్డి విశ్వంభర పుస్తకాలే తన రచనలకు స్ఫూర్తి అని చెబుతున్నారు. అప్పటివరకు కవిత్వాలు, రచనలు చేస్తున్న ధరణి ఓసారి కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవిత్వం పోటీల్లో విజయం సాధించడంతో పుస్తక రచనపై ఆసక్తి కలిగింది. అలా 'అరుణిమలు' అనే పుస్తకాన్ని రాసి అందరి ప్రశంసలు అందుకున్నారు. సమాజాన్ని చైతన్యవంతం చేసే రచనలు చేస్తున్నారు.

# ఎరువుల సరఫరాకు ఇబ్బంది..!

ఖమ్మం : మొన్నటివరకు డీఏపీ సక్రమంగా దొరక్క అన్నదాతలు అవస్థలు ఎదుర్కొన్నారు. ఇప్పుడు సహకార సంఘాల్లో తప్ప ప్రైవేటు దుకాణాల్లో యూరియా అందుబాటులో లేక అగచాట్లు పడుతున్నారు. ఎరువులు కావాల్సిన తరుణంలో ఖమ్మం జిల్లా కేంద్రానికి రావాల్సిన రైలు వ్యాగన్లు శనివారం (నేటి) నుంచి నిలిచిపోతున్నాయి. **ఇక పందిళ్లపల్లి స్టేషన్ నుంచే..**

రైల్వేశాఖ గతేడాది మూడో లైన్ నిర్మాణ పనులు చేపట్టింది. ఇవి ఖమ్మం రైల్వేస్టేషన్ నుంచి కొనసాగుతున్నాయి. ఎరువుల వ్యాగన్లు దిగుమతి అయ్యే ప్లాట్‌ఫాం గూడ్సు షెడ్డును మూడో లైనుకు అనుసంధానించి పనులు చేపట్టారు. ఇకపై ఖమ్మం వచ్చే గూడ్సు వ్యాగన్ల ఎగుమతులు, దిగుమతులన్నీ పందిళ్లపల్లి స్టేషన్‌లో జరుగుతాయని రైల్వేశాఖ అధికారులు ఉత్తర్వులు వెలువరించారు.

**నెల రోజుల పాటు అవస్థలు..**

వివిధ ఎరువుల కంపెనీలు ఖమ్మం జిల్లాకు వ్యాగన్ల ద్వారా సరకు తీసుకొస్తుంటాయి. సరకు దిగుమతులు, ఎగుమతులతో పాటు లారీల ద్వారా రవాణా చేసేందుకు హమాలీలు హ్యాండ్లింగ్ కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేసుకుంటారు. ఏటా టెండర్లు పిలిచి జిల్లా పరిధిలోని గోదాములు, ఇతర మండలాల గ్రామాల్లోని డీలర్ల పాయింట్లకు చేరవేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంటారు. అయితే ఖమ్మం రైల్వేస్టేషన్ గూడ్సు షెడ్ నుంచి ఈపనులు చేయటానికి గతంలో సదరు ఎరువుల కంపెనీలు కాంట్రాక్టు ఇచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం హమాలీలు, కాంట్రాక్టర్లు పందిళ్లపల్లి స్టేషన్ గూడ్సు షెడ్ నుంచి రవాణా చేసేందుకు ముందుకురావటం లేదని ఎరువుల



కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి ఎరువులు పంపిణీ చేసేందుకు మళ్లీ కొత్తగా హమాలీ, హ్యాండ్లింగ్ రవాణా కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తవటానికి కనీసం నెల రోజుల సమయం పడుతుందని తెలిపారు. ఖమ్మం గాంధీచౌక్ పరిసర ప్రాంతాల్లో పోలీసుశాఖ నుంచి ట్రాఫిక్ ఆంక్షలున్నాయి. దీనికి తోడు ఖమ్మం స్టేషన్‌కు వ్యాగన్లు ఆగిపోవటం వల్ల జిల్లాలో ఎరువుల కొరత ఏర్పడే అవకాశముందని, తాము ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునే వరకు నెలరోజులు వెసులుబాటు కల్పించాలని రైల్వేశాఖను కోరుతున్నారు.

**పెరగనున్న లారీ కిరాయిల భారం..**

మూలిగే నక్కపై తాటిపండు పడినట్టుగా అన్నదాతల పరిస్థితి తయారైంది. ఇప్పటికే పెరిగిన ఎరువుల ధరల భారం మోయలేక సతమతమవుతుంటే, గూడ్సు షెడ్ ఖమ్మం నుంచి పందిళ్లపల్లికి మార్చటంతో లారీ కిరాయిలు పెరిగే అవకాశముంది. ఖమ్మం నుంచి పందిళ్లపల్లి గూడ్సు షెడ్ 3కి.మీ.దూరం ఉంటుంది. అక్కడి నుంచి గోదాములు, డీలర్ పాయింట్లకు రవాణా చేసేందుకు లారీ కిరాయిలు అనివార్యంగా పెరుగుతాయి. ఈ భారం వినియోగదారులు భరించక తప్పదని లారీ యజమానులు చెబుతున్నారు. ఇప్పటికే 15 రోజుల నుంచి జిల్లాకు యూరియా వ్యాగన్లు రావటం లేదు. ఇప్పుడు ప్లాట్‌ఫాం సమస్యతో ఎరువుల కొరత ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి.

# పర్యావరణం హితం కోరి..

నల్గొండ : మనిషి జీవితంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం విడదీయలేని బంధంగా మారింది. తక్కువ ఖర్చుతో పాటు సులభంగా అన్ని అవసరాలకు ఉపయోగపడేవి కావడంతో ప్రతి ఒక్కరూ వీటిపై ఆధారపడుతున్నారు. తక్కువ మైక్రాన్‌తో తయారు చేసిన ప్లాస్టిక్ ప్లేట్లు, టీ కప్పులు, క్యారీబ్యాగులు, మంచినీటి సీసాలు, మార్కెట్‌లో విచ్చలవిడి అమ్మకాలు జరుగుతున్నాయి. నిత్యం హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లలో జరిగే శుభ, అశుభ కార్యక్రమాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో జరిగే చిన్నపాటి కార్యాలకు ప్లాస్టిక్ వస్తువుల వినియోగం విపరీతంగా పెరిగింది. దీని మూలంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు సూచిస్తున్నారు.మాడ్గులపల్లి మండలం చెర్వుపల్లి గ్రామానికి చెందిన నెర్మటి లక్ష్మి భర్త రవీందర్‌రెడ్డితో కలిసి ఆర్టీసీ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటూ ఇద్దరు ఆడపిల్లలను బీటెక్ చదివిస్తోంది. కుటుంబ పోషణ కోసం సంప్రదాయ విస్తరాకుల అమ్మకాలు చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తుంది. పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ పూర్తి చేసి అడ్డాకులు, మోదుగు ఆకులు ఉపయోగిస్తూ భూమిలో కలిసి పోయే అట్టముక్కలతో




విస్తర్లు తయారు చేస్తున్నారు. దీంతోపాటు పలువురికి వీటి వాడకం వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తున్నారు.

**ఏపీ నుంచి దిగుమతి.. నెర్మట లక్ష్మి**

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం నుంచి అడ్డాకులు, మోదుగు ఆకులను దిగుమతి చేసుకుని విస్తరాకులు తయారు చేస్తున్నాం. ఇక్కడి నుంచి హైదరాబాద్, రాజమహేంద్రవరం, గుంటూరు, తెనాలి, విజయవాడకు ఆర్డర్లపై ఎగుమతి చేస్తున్నాం. భోజన ప్లేటుపై రూపాయి, టిఫిన్‌ప్లేట్లపై రూ.50పైసలు లాభం వస్తోంది. **క్యాన్సర్లు తగ్గుతాయి: డా. వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో**కెమికల్‌తో తయారు చేసిన విస్తరాకులు ఇతర ప్లేట్ల మూలంగా క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉంది. దీనికి తోడు ఇవి భూమిలో కరగకపో వడం మూలంగా ఇతర సమస్యలు తలెత్తుతాయి. మొక్కల ఆకులతో పాటు భూమిలో కరిగే పేపర్ ద్వారా ఎటువంటి ఇబ్బందులు ఉండవు.

# చెరువుల చుట్టూ నిర్మాణాలపై నజర్

హైదరాబాద్: గతంలో చెరువులు, నీటి కుంటలకు సమీపంలో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రస్తుతం కొత్త నిర్మాణాలకు మాత్రం ఎన్వోసీలు ఉండాల్సిందేనని స్పష్టం చేస్తోంది. అనుమతులకు దరఖాస్తు చేసుకున్న వారు ఎన్వోసీల కోసం నీటిపారుదల శాఖ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. హెచ్ఎండీఏ మాస్టర్‌ప్లాన్ ప్రకారం బఫర్‌జోన్‌కు దూరంగా 200 మీటర్లు ఆపై ఉంటే నిర్మాణాలకు గతంలో అనుమతులిచ్చింది. ఇదే




అదనుగా భారీ ఎత్తున అక్రమాలు సైతం జరిగాయి. కొన్నిసార్లు బఫర్‌జోన్‌లో ఉన్నప్పటికీ మాస్టర్‌ప్లాన్‌లో మాయ చేసి అప్పటి అధికారులు అనుమతులు ఇచ్చారు. చెరువులు, నీటి వనరులకు 200 మీటర్లలోపు నిర్మాణాల కోసం దరఖాస్తులు వస్తే నిశితంగా పరిశీలిస్తోంది. మాస్టర్‌ప్లాన్‌లో చెరువులు, నీటి వనరులు లేకపోయినా ఇరిగేషన్, రెవెన్యూ మ్యాపులను తెప్పించుకొని జాగ్రత్తగా హెచ్ఎండీఏ అధికారులు పరిశీలిస్తున్నారు.

# ఆస్తి పన్నులో కట్టలుగా లోపాలు

హైదరాబాద్: ప్రభుత్వానికి చేరాల్సిన ఆస్తిపన్ను వసూళ్లకు.. కింది స్థాయి అధికారులు భారీగా గండి కొట్టారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి తిరిగి, వాస్తవ కొలతలు, వినియోగాన్ని నమోదు చేసుకుంటోన్న జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్)తో ఆ విషయం స్పష్టమవుతోంది. ఇప్పటి వరకు సుమారు లక్ష ఇళ్లను బల్దియా సర్వే చేసింది. వాస్తవ పరిస్థితులకు భిన్నంగా పన్ను చెల్లిస్తోన్న నిర్మాణాలు అనేకం లెక్క తేలాయి. వివరాల ప్రకారం.. ప్రధాన రహదారులపై ఈ ఉల్లంఘనలు కనిపిస్తున్నాయి. నివాస కేటగిరీలో ఇంటి అనుమతి తీసుకుని, వ్యాపార కేంద్రాలుగా నడుస్తోన్న భవనాలకు సిబ్బంది



నామమాత్రంగా పన్ను విధించి, యజమానుల నుంచి నోట్ల కట్టలు తీసుకున్నారనే విమర్శలొస్తున్నాయి.

**5 కాలనీల్లో 100 శాతం పూర్తి..** జీఐఎస్ సర్వేలో మూడు దశలు ఉంటాయి. మొదటిది డ్రోన్ సర్వే. నగరం మొత్తాన్ని డ్రోన్ కెమెరాలు ఇప్పటికే చిత్రీకరించాయి. ఇంటింటికీ వెళ్లి.. ఇంటి నంబర్ల ఆధారంగా వివరాలను తీసుకోవడం రెండోది. మూడో దశలో..అన్ని ఇళ్లను ఫొటో తీసి.. వాటిని డ్రోన్లు చిత్రీకరించిన పటాలపై వాస్తవ విస్తీర్ణంలో చేర్చడం తరువాయి. మొదటి దశలో ఎప్పుడో పూర్తయింది. రెండోదశ పురోగతిలో ఉండగా.. చందానగర్, హయత్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని ఐదు కాలనీలు మూడో దశ వరకు సర్వే పూర్తి చేసుకున్నాయి.

పెరగనున్న డిమాండ్.. ఆస్తిపన్ను ద్వారా జీహెచ్ఎంసీకి ప్రస్తుతం ఏడాదికి రూ. 2వేల కోట్ల ఆదాయం వస్తోంది. జీఐఎస్ సర్వే పూర్తయితే ఆదాయం రూ. 2500–2,800 కోట్లకు పెరుగుతుందనే అంచనాలున్నాయి. ప్రస్తుతం 2లక్షల ఇళ్లలోనే 100శాతం సర్వే జరిగిందని, మిగిలిన 23 లక్షల కట్టడాలను జీఐఎస్ మ్యాపింగ్ చేస్తే.. పన్ను మదింపులోని లోపాలు వెలుగులోకి వస్తాయి.

డ్రోన్ సర్వే పూర్తయిన పరిధి.. 650 చ.కి.మీ

ప్రయోగాత్మకంగా ఇంటింటి సర్వే మొదలైన వార్డులు.. 33

సమాచార సేకరణ 100శాతం పూర్తయిన కాలనీలు.. 5

# మెట్రోతో తగ్గేదెంత? పెరిగేదెంత?


హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం మెట్రోరైలు ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలంటే చాలా అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. ట్రాఫిక్ అధ్యయనాలతోపాటూ ఫైనాన్షియల్ ఇంటర్నల్‌రేట్ ఆఫ్ రిటర్న్ (ఎఫ్ఐఆర్ఆర్), ఎకనమిక్‌రేట్ ఆఫ్ రిటర్న్(ఈఐఆర్ఆర్) వంటి అంశాలను లెక్కలోకి తీసుకుంటుంది. వీటన్నింటిని మదింపు చేశాకే మెట్రో డీపీఆర్‌లను ఆమోదించి.. ప్రాజెక్టుకు అనుమతి ఇస్తుంది.

**గణాంకాలు సానుకూలం!:** మెట్రోరైలు రెండోదశలోని ప్రతిపాదిత మార్గాల్లో ఎఫ్ఐఆర్ఆర్, ఈఐఆర్ఆర్ సానుకూలంగా ఉన్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్(హెచ్ఏఎంఎల్)కేంద్రానికి పంపిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 76.4 కి.మీ. ప్రాజెక్ట్‌పై రూ. 24,269 కోట్లు వెచ్చించి మౌలిక వసతులు అభివృద్ధి చేస్తే ఏ మేరకు సంపద పెరుగుతుంది? ఎప్పుడు తిరిగి వస్తుంది? వంటి అంశాలను ఎఫ్ఐఆర్ఆర్‌లో మదింపు చేస్తారు. 8%పైన ఉంటే సానుకూలంగా ఉన్నట్లుగా పరిగణిస్తారు. విమానాశ్రయ కారిడార్‌లో 18.16% అత్యధికంగా, పాతబస్తీ కారిడార్‌లో 10.30% ఎఫ్ఐఆర్ఆర్ ఉంది. కాబట్టి కేంద్ర అనుమతిపై మెట్రో అధికారులు సానుకూలంగా ఉన్నారు.

**ఇంధనం, కాలుష్యం ఎంత తగ్గుతుంది?**

మెట్రో ప్రాజెక్ట్ చేపట్టడం ద్వారా ఏమేరకు ప్రయోజనం కలుగుతుంది అనేది ఈఐఆర్ఆర్ తెలియజేస్తుందని మెట్రో అధికారులు తెలిపారు. మెట్రోలో ప్రయాణాల ద్వారా ఎంత మేరకు ఇంధనం ఆదా అవుతుంది? కాలుష్యం ఏ మేరకుతగ్గుతుంది? రవాణా పరంగా ఆదా అయ్యే సమయం ఎంత? పెరిగే ఉత్పాదకత ఎంత? వంటి అంశాలను ఈఐఆర్ఆర్‌లో చూస్తారని అధికారులు చెప్పారు. నాగోల్–విమానాశ్రయ కారిడార్, మియాపూర్–పటాన్‌చెరు మార్గాలతో ఎక్కువ ప్రయోజనం ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

# అదనపు తరగతులు ఏదీ అల్పాహారం?



వికారాబాద్ : 'పది' ఫలితాల్లో వికారాబాద్ జిల్లా రెండేళ్లుగా అట్టడుగున నిలుస్తోంది. ఈసారి 'శత శాతం' ఫలితాలు సాధించి ఉన్నత స్థానంలో నిలవాలని జిల్లా విద్యాధికారులు ఆరంభం నుంచే దృష్టి సారించారు. వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపించి అందరూ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు గత నెలలో సాయంత్రం వేళ ప్రత్యేక తరగతులు కూడా ప్రారంభించారు. కొద్ది రోజుల్లో ఉదయం పూట ప్రారంభం కానున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా వీరికి ఎలాంటి అల్పాహారం ఇవ్వడంలేదు. దీంతో విద్యార్థులు ఆకలితో నీరసించిపోతున్నారు. చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నారు. ఈ పరిస్థితులకు సంబంధించి 'న్యూస్‌టుడే' కథనం.

**గతేడాది అధికారుల చొరవ**

సాయంత్రం పాఠశాల నిర్ణీత వేళల తరువాత 45 నిమిషాల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గతేడాది అధికారుల చొరవతో నిత్యం ఒక రకం చొప్పున అల్పాహారం అందించారు. ప్రస్తుతం ప్రత్యేక తరగతులు ప్రారంభమై నెల రోజుల గడిచింది. అల్పాహారంపై ఎవరూ దృష్టి పెట్టలేదు. పరీక్షలు మార్చి రెండో వారం మొదలవుతాయి. తరగతులేమో మరో 2 నెలల పాటు సాగుతాయి. అప్పటిదాకా వీరి పరిస్థితి ఏమిటనేది ఎవరూ ప్రస్తావించడంలేదు.

చిరుధాన్యాల ఆహారం అందించాలి: నందిని, వికారాబాద్

విద్యార్థులకు చిరుధాన్యాల ఆహారం (చిక్కీలు, బిస్కెట్లు తదితరాలు) అందిస్తే బాగుంటుంది. ఉదయం ఇంటి నుంచి బయలుదేరుతాం. సాయంత్రం ఇంటికి వెళ్లే సరికి రాత్రవుతోంది. దీంతో నీరసం పెరిగిపోతోంది.

**మధ్యాహ్న భోజనమే ఆధారం**

జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పట్టణాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు సుమారుగా రెండు కి.మీ.దూరంలోని మారుమూల గ్రామాల నుంచి సైతం విద్యార్థులు ఉదయమే వస్తుంటారు. కొందరు ఖాళీ కడుపుతోనే బడికి వస్తున్నారు. మధ్యాహ్నం భోజనంపైనే ఆధారపడుతున్నారు.

**దాతలు చొరవ చూపాలి**

జిల్లాలోని పలువురు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాంటి దాతలు విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటుకు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపి ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో స్నాక్స్ ఏర్పాటు చేస్తే విద్యార్థుల ఆకలి తీర్చిన వారవుతారు. **సంక్రాంతి సెలవుల తర్వాత ఉండొచ్చు : రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి** విద్యార్థుల ఇబ్బందిని మేం కూడా గమనిస్తున్నాం. ప్రభుత్వమే సంక్రాంతి పండుగ తర్వాత స్నాక్స్ ఇచ్చే అవకాశం ఉంది. దాతల విషయంలో నిబంధనలున్నాయి. అనుమతి లేనిదే వసతి గృహాలు, గురుకుల పాఠశాలలకు వెళ్లటానికి వీలు లేదని కలెక్టర్ కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.

# పరస్పర బదిలీలు.. జోరుగా బేరసారాలు



కరీంనగర్ : 317 జీవో నిబంధనల్లో పేర్కొన్న పరస్పర బదిలీలు కొందరు ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాన్ని తెచ్చిపెట్టేలా ఉన్నాయి. పక్క జిల్లాల్లో ఉన్న వారు సొంత, కోరుకున్న జిల్లాలకు వచ్చేందుకు పరస్పర బదిలీలను ఉపయోగపడనున్నాయి. ఇద్దరు ఉపాధ్యాయుల సమ్మతితో జరిగే ఈ బదిలీల్లో స్థానిక జిల్లాలను వదులుకొని ఇతర జిల్లాలకు వెళ్లేందుకు, వారి స్థానంలో వచ్చేందుకు ఆసక్తి చూపుతున్న వారి మధ్య బేరసారాలు జోరందుకున్నాయి. ఈనెల 30వ తేదీలోపు ఈ బదిలీలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

**ఉద్యోగ విరమణ పొందే వారే..**

పరస్పర బదిలీల ద్వారా ఇతర జిల్లాలకు వెళ్లేందుకు ఉద్యోగ విరమణ దగ్గర్లో ఉన్న వారే ఆసక్తి చూపుతున్నారు. వారి స్థానంలో ఇక్కడికి వచ్చే వారి మధ్యే ఇలాంటి బేరసారాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఇక ముందు పదోన్నతి పొందలేమనే భావనలో ఉన్న కొందరు ఫిజికల్ డైరెక్టర్లు కూడా ఈ ప్రయోజనాన్ని పొందేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. భూపాలపల్లి జిల్లా నుంచి కరీంనగర్ జిల్లాకు వచ్చేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. సిద్దిపేట జిల్లాలో పనిచేస్తున్న వారు కూడా ఉత్సాహాన్ని చూపుతున్నారు. పరస్పర బదిలీపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి వీడిపోయిన పక్క జిల్లాలకు వెళ్లేందుకు సమ్మతిగా ఉన్నట్లు పలువురు ఉపాధ్యాయులు వాట్సప్ గ్రూపుల్లో సందేశాలను పెడుతున్నారు.

**వాట్సాప్ గ్రూపుల వేదికగా...**


పరస్పర బదిలీల కోసం చరవాణుల్లో ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని బదిలీపై వెళ్లే వారు పని చేస్తున్న పాఠశాల పేరు, కేటగిరీ, చరవాణి నంబర్లను పొందుపరుస్తున్నారు. ఏ జిల్లాలకు వెళ్లేందుకు సమ్మతిస్తున్నారో వాటి వివరాలను పొందుపరుస్తున్నారు. అవసరమైన ఉపాధ్యాయులు వారిని సంప్రదిస్తున్నారు. పరస్పర బదిలీల కోసం వారి మధ్య బేరసారాలు గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నాయి.

**కరీంనగర్ జిల్లాకు అధిక డిమాండ్..**

పరస్పర బదిలీల ద్వారా కరీంనగర్ జిల్లాకు వచ్చేందుకు అధిక డిమాండ్ ఉంది. రూ. 10 లక్షలు కూడా ఇవ్వడానికి కూడా వెనుకడటంలేదు. ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు వెళ్లే వారు రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నారనే చర్చ ఉపాధ్యాయుల్లో నడుస్తోంది. హెచ్ఆర్ఏ సౌకర్యం గల పాఠశాలల వారు అంతకు మించి అడుగుతున్నట్లు సమాచారం. ఇక్కడి నుంచి రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్న రూ. 5 లక్షల నుంచి రూ. 8 లక్షల వరకు అడుగుతున్నట్లు తెలిసింది. కాస్త మారుమూల ప్రాంతానికి వెళ్లే వారి మరింత ఎక్కువ అడుగుతున్నారు.

# ఎన్టీపీసీలో కొత్త దందా

గోదావరిఖని: రామగుండం ఎన్టీపీసీలో కొత్త దందాకు తెరతీశారు. ఒక్కో కాంట్రాక్టు ఉద్యోగానికి గతంలో భారీ మొత్తంలో వసూలు చేసి శాశ్వత లొకేషన్‌లలో పనులు కల్పించారు. తాజాగా కాంట్రాక్టు పూర్తవుతున్న ఓ ప్రైవేటు కంపెనీలో 29 మందిని నియమించుకోవడానికి రంగం సిద్ధం చేశారు. దీనికి సంబంధించిన ప్రకియను పూర్తిచేసినట్లు తెలిసింది. కాగా మూడు నెలల్లో ఆ కంపెనీకి సంబంధించిన గడువు ముగియనుంది. ప్రస్తుతం మూడు నెలల తాత్కాలిక పనుల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసి నియమిస్తున్నట్లు ఆరోపణలు మిన్నంటుతున్నాయి. తిరిగి ఇదే కంపెనీకి కాంట్రాక్టు పొడిగించడం ద్వారా వారిని శాశ్వతంగా అదే లొకేషన్‌లో కొనసాగించవచ్చని భావించిన ఓ అధికారి సదరు గుత్తేదారు కంపెనీకి చెందిన ఓ తాత్కాలిక ఉద్యోగితో కలిసి దందా చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సదరు అధికారి ప్రమేయంతో ఎన్టీపీసీలోని వివిధ లొకేషన్‌లలో గుత్తేదారులతో కుమ్మక్కై భారీగా కాంట్రాక్టు ఉద్యోగాల్లో నియామకాలు చేపట్టినట్లు ఆరోపణలున్నాయి. గుత్తేదారులతో చేతులు కలిపి తన అక్రమ దందాను కొనసాగిస్తున్న ఆయన తాజాగా కొత్తగా 30 మందికి ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. వారికి సంబంధించిన వైద్య పరీక్షలు కూడా పూర్తి చేసినట్లు సమాచారం. ఇందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు తెలుస్తోంది. కేవలం మూడు నెలల కోసం మాత్రమే వీరిని నియమిస్తున్నట్లు బయటకు ప్రచారం చేస్తున్నా దీనివెనుక భారీ మొత్తంలో ఉద్యోగ దందా సాగుతున్నట్లు సమాచారం. ఆ కంపెనీకి మూడు నెలల్లో కాంట్రాక్టు గడువు పొడిగించి మరి కొంత మందిని నియమించుకునేలా నిబంధనలు మార్చనున్నట్లు సమాచారం. దీనివల్ల ప్రస్తుతం కొత్తగా నియమిస్తున్న వారికి శాశ్వత లొకేషన్‌లలో ఉద్యోగం పదిలంగా ఉంటుందన్నది వారి ఆలోచన.



**ఇష్టారీతిన నియామకాలు?**

ఎన్టీపీసీలో ఉద్యోగ నియామకాల దందా ఆగడం లేదు. కొత్తగా నిర్మించిన తెలంగాణ ప్రాజెక్టులో ఏర్పడుతున్న కొత్త లొకేషన్‌లలో ఇష్టం వచ్చిన రీతిలో కాంట్రాక్టు ఉద్యోగులను నియమిస్తున్నారు. ఉద్యోగాల నియామకాల్లో గుత్తేదారులతో పాటు కొందరు అధికారులు, సంస్థలోని ఓ నాయకుడి సమన్వయంతోనే ఈ దందా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి కాంట్రాక్టు ఉద్యోగానికి రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలోనే దీనిపై ఎన్టీపీసీ విజిలెన్స్ విభాగం అధికారులు విచారణ చేపట్టారు. అనంతరం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజా అంశాలపై దృష్టి సారించి విచారణ చేస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

# నిఘా కళ్లు.. ఉంటేనే మేలు

తాండూరు : జిల్లాలో నేరాల ఛేదన, భద్రతల పెంపులో పోలీసులు సీసీ కెమెరాల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆరంభంలో వీటి నిర్వహణ అన్నిచోట్ల బాగున్నా, తరువాత దారి తప్పసాగింది. దీన్నిమళ్లీ పట్టాలెక్కించడానికి జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కథనం.


**2017లో నేను సైతం కార్యక్రమంతో శ్రీకారం**

దొంగలను పట్టుకోవడానికి, భద్రతను మెరుగుపర్చడానికి దోహదపడే సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజల భాగస్వామ్యాన్ని కోరుతూ వికారాబాద్ పోలీసులు 2017 ఆగస్టు 18న 'నేను సైతం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీన్లో భాగంగా కాలనీల్లోని ప్రజలు స్వయంగా డబ్బులు వసూలు చేసుకొని తమ కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు వికారాబాద్ పురపాలిక పరిధిలో 550 ఏర్పాటు చేశారు.

**కొన్ని ఉదాహరణలు**

జూన్ 30న పరిగి పట్టణంలోని టీచర్స్ కాలనీలో తాళం వేసి ఉన్న ఐదిళ్లలో చోరీకి పాల్పడ్డారు. సీసీ టీవీ ఫుటేజీలను నిశితంగా పరిశీలించి చోరీకి పాల్పడిన ముగ్గురు శికారి ముఠా సభ్యుల ముఖ చిత్రాలను గుర్తించి పట్టుకున్నారు. చోరీకి గురైన 70 గ్రాముల బంగారాన్ని జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

తాండూరు పట్టణంలో నాలుగు మాసాల కిందట ఓ వ్యక్తి ఒకే తరహాలో ముగ్గురిని మట్టుబెట్టాడు. సీసీ కెమెరా ఆధారంగానే ధారూర్



మండలానికి చెందిన సైకో నిందితున్ని అరెస్టు చేశారు.

వికారాబాద్ మహాశక్తి చౌరస్తా సమీపంలో ఓ మహిళలను ద్విచక్ర వాహనం ఢీ కొంది. నిందితుడు పారిపోయాడు. రామయ్యగూడ రోడ్డులో ఈవ్ టీజింగ్‌కు గురైన యువతి తీవ్ర మనస్తాపం చెందింది. ఈ రెండు ఘటనల్లో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో నిందితులను పోలీసులు గుర్తించలేదు.

సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

అన్ని గ్రామాలు, కూడళ్లలో సీసీ కెమెరాలను ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసే దిశగా దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశాం. సీసీ కెమెరాల కోసం విరాళం ఇచ్చే దాతలను సత్కరిస్తున్నాం. ప్రజల భాగస్వామ్యంతో సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు 6,300 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఇంకా ఏర్పాటు చేయిస్తున్నాం. వీటిలో 350 వరకు సాంకేతిక లోపంతో పని చేయడం లేదు. మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తెస్తాం. నారాయణరెడ్డి, జిల్లా పోలీసు అధికారి.

# ప్లాట్లుగా ప్రభుత్వ భూములు

హైదరాబాద్: ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను కొందరు రియల్ వెంచర్ల ప్రతినిధులు ప్లాట్లుగా విభజించి విక్రయించేస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి పది కిలోమీటర్ల దూరంలోని నాగిరెడ్డిపల్లిలో ఈ వ్యవహారం కొనసాగుతోంది. ఇప్పటికే మూడు వెంచర్లలో రూ. 30కోట్ల విలువైన సుమారు నాలుగు ఎకరాల భూమిని ప్లాట్లుగా చేసి విక్రయించారని స్థానికులు పంచాయతీ అధికారులకు గతనెలలో ఫిర్యాదు చేశారు.

నాలుగు వెంచర్లు.. ఉద్యానాలకు స్థలాలు.. మహేశ్వరం మండలం నాగిరెడ్డిపల్లిలో కొందరు రియల్ వ్యాపారులు 15 ఏళ్ల క్రితం స్థానికుల నుంచి యాభై ఎకరాల పొలాలు కొన్నారు. కొన్నేళ్ల క్రితం వైట్‌ఫీల్డ్, పినాకిల్ ప్యారడైజ్, వాయు విహార్ పేర్లతో వెంచర్లు వేసేందుకు డీటీసీపీ



నుంచి అనుమతులు పొందారు. ఉద్యానాలు.. రహదారులకు పంచాయతీకి పదిశాతం బహుమతిగా ఇచ్చారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సర్వే నంబర్లకు బై నంబర్లు వేయిస్తుండటంతో డబుల్ రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని వైట్‌ఫీల్డ్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డీపీవోకు కొద్దిరోజుల క్రితం ఫిర్యాదు చేశారు.

నాలుగెకరాలు పంచాయతీదే: లక్ష్మీనారాయణ, డివిజన్ పంచాయతీ అధికారి

వెంచర్లను పరిశీలించాం. సుమారు నాలుగు ఎకరాల భూమి గ్రామ పంచాయతీకి చెందినదే. రియల్ వెంచర్ల ప్రతినిధులను కార్యాలయానికి రమ్మని కబురు పంపినా వారు రాలేదు.

# రసాయన గరళం.. వాగు నీరు కలుషితం

మోమిన్‌పేట: మండల పరిధిలోని రాళ్లగుడుపల్లి, మేకవనంపల్లి గ్రామాల శివారులోని రామేశ్వరాలయం పరివాహక ప్రాంతం గుండా దశాబ్దాలుగా పారుతున్న నందివాగు ఏనాడూ కలుషితమైన దాఖలాలు లేవు. అలాంటిది ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రసాయన వర్థ్యాలను వదలడంతో స్వచ్ఛమైన నీరంతా ఎర్రగా మారింది. రామేశ్వరాలయం సమీపం నుంచి క్రషర్ వెళ్లే మార్గంలో వంతెన దగ్గర వ్యర్థ్యాలు కలిపినట్టు స్థానికులు గుర్తించి సోమవారం ఉదయం రెవెన్యూ అధికారులు, మోమిన్‌పేట ఠాణా పోలీసులకు సమాచారం అందించారు. ఠాణా ఎస్సై అరవింద్, ఆర్ఐ గోవర్ధన్ వాగు దగ్గరికి వెళ్లి పరిశీలించారు. వాగు మార్గంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తులను గుర్తిస్తామని పోలీసులు తెలిపారు. నీరు వాడకుండా రైతులను అప్రమత్తం చేశారు.

**వృక్ష రాజం.. స్వాగత తోరణం**

వికారాబాద్ అనంతగిరి కొండలు ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. ఇక్కడ కొలువైన అనంత పద్మనాభుని దర్శనానికి చేరుకోవడానికి ముందు రోడ్డుకు ఇరువైపులా స్వాగతం తెలిపే విధంగా ఏళ్లనాటి పెద్ద పెద్ద వృక్షాలు కనువిందు చేస్తాయి. ఇవి సుమారు 6 కిలోమీటర్ల దూరం మేర ఇలా రోడ్డుకు ఇరువైపులా విస్తరించి ఉన్నాయి. వీటినుంచి వచ్చే చల్లటి గాలులను ఆస్వాదిస్తూ హాయిగా సాగుతూ భక్తులు స్వామిదర్శనం చేసుకుంటున్నారు.



# 2 రాష్ట్రాలకు కల్లక్కడల్ ముప్పు.. ఇదెంత డేంజర్ అంటే?

కేరళ.. తమిళనాడు రాష్ట్రాలకు కల్లక్కడల్ ముప్పు పొంచి ఉందని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఒకటి ఆయా రాష్ట్రాలను హెచ్చరించింది. వాయుగుండం.. తుపాను.. పెను తుపాను.. సునామీ లాంటివి అందరూ విని ఉంటారు. మరి.. ఈ కల్లక్కడల్ అంటే మిటి? అన్న విషయంలోకి వెళితే..సముద్రంలో హటాత్తుగా సంభవించే మార్పుగా అభివర్ణిస్తారు. ఒక బందిపోటులా దూసుకు వస్తుందని చెప్పాలి. సముద్రం ఒక బందిపోటులా దూసుకొచ్చే తీరును కల్లక్కడల్ గా పేర్కొంటారు. ఎలాంటి వార్నింగ్ లేకుండా గాలులు వీయటాన్ని కల్లక్కడల్ గా పిలుస్తుంటారు. హిందూ మహాసముంద్రంలోని దక్షిణ భాగంలో కొన్నిసార్లు వీచే బలమైన గాలులే సముద్రం ఇలా అకస్మాత్తుగా ఉప్పొంగడానికి కారణంగా చెబుతారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి సూచన.. వార్నింగ్ ఇవ్వకుండా వీచే బలమైన గాలులుగా దీన్ని చెప్పాలి. స్థానికంగా దీన్ని కల్లక్కడల్ గా వ్యవహరిస్తారు. జనవరి 15 రాత్రి అకస్మాత్తుగా సముద్రంలో వచ్చే ఉప్పెన కారణంగా బలమైన అలలు ఎగిసిపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీరంలోని వివిధ ప్రాంతాల్లో 0.5 మీటర్ల నుంచి ఒక మీటర్ మేర అలల తాకిడి ఉంటుందని.. సముద్ర ఉప్పెన ముప్పు పొంచి ఉన్నట్లుగా ఇండియన్ నేషనల్ ఫర్ ఓసియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ వార్నింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కేరళ విపత్తు ప్రతిస్పందన నిర్వాహణ సంస్థ కూడా అలెర్టు అయ్యింది. అధికారుల సూచన మేర తీర ప్రాంత ప్రజలు సురక్షిత ప్రదేశాలకు తరలి వెళ్లాలని సూచన చేశారు.

తీరప్రాంత వాసులు ఎట్టి పరిస్థితుల్లోనూ పడవలు.. దేశవాళీ పడవులు వేసుకొని సముద్రంలోకి వెళ్లొద్దన్న ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు.. ముందుగానే పడవల్ని సురక్షిత ప్రాంతాలకు చేర్చుకోవాలని కోరారు. అంతేకాదు.. ఈ ప్రకటనను వెనక్కి తీసుకునే వరకు పర్యాటకులు ఎవరూ బీచ్ లలో విహారానికి రాకూడదని స్పష్టం చేశారు. అంతేకాదు.. తీర ప్రాంతాల మీద ప్రత్యేకంగా నిఘాను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

# కాలం మారినా తరగని అనుబంధాల సంపద మనది: సీఎం చంద్రబాబు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు కనుమ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. కమ్మని విందుల కనుమ పండుగ అందరి కుటుంబంలో సంతోషం నింపాలని ఆకాంక్షించారు. రైతుల జీవితాలతో విడదీయరాని అనుబంధం పెనవేసుకొన్న పశు సంపదను పూజించే పవిత్ర కర్తవ్యాన్ని ఈ పర్వదినం మనకు బోధిస్తుందని చెప్పారు.

కాలం మారినా తరగని అనుబంధాల సంపద మనదని పేర్కొన్నారు. ఆ విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వివరించారు.

**కనుమ.. అన్ని ప్రయత్నాల్లో విజయాన్ని తీసుకురావాలి: లోకేశ్...** తెలుగు ప్రజలకు ఏపీ మంత్రి లోకేశ్ కనుమ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండగ అన్నదాతలకు అత్యంత ప్రీతిపాత్రమైందని చెప్పారు. "రైతన్నలు ఏడాది పొడవునా తమ కష్టంలో పాలుపంచుకునే పశువులను పూజించే పర్వదినమని ఇది. అన్నదాతల ఇల్లు ధాన్యరాశులతో నిండుగా, పాడిపంటలతో పచ్చగా.. ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నా. కనుమ.. అన్ని ప్రయత్నాల్లో విజయాన్ని, ఆనందాన్ని తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నా" అని లోకేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

# పండుగ వేళ మంత్రి లోకేష్ సంచలన కామెంట్స్..




అమరావతి, జనవరి 15: పండుగ వేళ మంత్రి నారా లోకేష్ సంచలన కామెంటగ్స్ చేశారు. ఇసుక, లిక్కర్ కుంభకోణాల్లో చాలా మంది త్వరలోనే జైలుకు వెళ్తారని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి డౌట్ లేదని ఉద్ఘాటించారు మంత్రి. రెడ్ బుక్‌ను మర్చిపోలేదని, తన పని చేసుకుపోతోందని వ్యాఖ్యానించారు. బుధవారం నాడు చంద్రగిరి ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన మంత్రి లోకేష్.. త్వరలోనే బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మిస్తామన్నారు. కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఫీడ్ బ్యాక్ తీసుకుని కష్టపడిన వారికి గుర్తింపునిస్తామన్నారు. ఫిబ్రవరి నుంచి పార్టీని బలోపేతం చేసే పని ప్రారంభిస్తామన్నారు. పార్టీ కోసం అధిక సమయం కేటాయిస్తానని లోకేష్ చెప్పారు. చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లెలో ముఖ్యనాయకులు, కార్యకర్తలతో మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి లోకేష్.. ఇలా తన చుట్టూ తిరగడం వల్ల పదవులు రావని పార్టీ నాయకులకు తేల్చి చెప్పారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే పదవులు వస్తాయన్నారు. పార్టీలో సంస్కరణలు తేవాల్సి ఉందన్నారు. టర్మ్ లిమిట్స్ ఉండాలన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా తాను 3వసారి కొనసాగుతున్నానని లోకేష్ గుర్తు చేశారు. గ్రామం నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీలో వ్యవస్థాగతంగా మార్పులు రావాలని ఆయన అభిప్రాయపడ్డారు. పొలిట్ బ్యూరోలో ప్రతి రెండేళ్లకు ఒకసారి 30శాతం కొత్తవారు రావాలని.. అప్పుడే పార్టీలో మూమెంట్ వస్తుందన్నారు. అహర్నిశలు పాటుపడ్డవారికే గత ఎన్నికల్లో టిక్కెట్లు ఇచ్చామని లోకేష్ తెలిపారు. ఫీల్డ్‌లో ఏం జరుగుతుందో ఎప్పటిప్పుడు తెలుసుకుంటామన్నారు. 1994 తర్వాత టిడిపి గెలవని నియోజకవర్గం చంద్రగిరి అని.. ఈ సారి మాత్రం భారీ మెజారిటీతో గెలిచామని పార్టీ శ్రేణులను అభినందించారు మంత్రి లోకేష్. గత ప్రభుత్వంలో ప్రజలు, కార్యకర్తలు ఇబ్బంది పడ్డారన్నారు. యువగళం, నిజం గెలవాలి కార్యక్రమాలను విజయవంతం చేశారన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమికి ఎన్నడూ లేని విధంగా 164 సీట్లు ఇచ్చారన్నారు. భారీ మెజారిటీతో గెలిచాం కదా అని తప్పులు చేయొద్దని పార్టీ కేడర్‌కు లోకేష్ హితవు చెప్పారు. 'మనమంతా ఒళ్లు దగ్గరపెట్టుకొని పనిచేయాలి. ప్రజలు ఆశతో మనవైపు చూస్తున్నారు' అని చెప్పుకొచ్చారు.

**ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు..** 'యువగళంలో పోలీసులు ఎన్ని ఇబ్బందులు పెట్టారో నాకు తెలుసు. తప్పు చేసిన ఎవరినీ వదలే ప్రసక్తిలేదు. అనవసరంగా కేసులు పెట్టడం మన విధానం కాదు. సోషల్ మీడియా చూసి మీరు కంగారుపడి నన్ను కంగారుపెట్టొద్దు. తిరుపతి పార్లమెంటు పరిధిలో దొంగఓట్ల వ్యవహారాన్ని కూడా వదిలిపెట్టం. ఫిబ్రవరి నుంచి స్వర్ణాంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఇందులో పార్టీ కేడర్ అంతా భాగస్వాములు కావాలి. మనం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి. కూటమి ప్రభుత్వంలో మనది పెద్దన్న పాత్ర, మిత్రధర్మంతో పనిచేస్తున్నాం. కొంతమంది ఆవేశంతో మాట్లాడినా ఓర్పుగా ఉండాలి. ఆవేశపడితే రాష్ట్రం, ప్రజలు నష్టపోతారు. ఈ అయిదేళ్లు ఓపికగా, సంయమనంతో రాష్ట్రాన్ని ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది. నెలాఖరుకు నామినేటెడ్ పోస్టులు భర్తీచేస్తాం. ఎఎంసిలను కూడా త్వరలో నియమిస్తాం. సీనియర్లు, జూనియర్లను సమానంగా ప్రోత్సహిస్తాం. పనిచేసేవాళ్లను గౌరవిస్తాం. గతంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ, సభత్వనమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్న కేడర్‌కు గుర్తింపునిస్తాం.' అని పార్టీ శ్రేణులకు మంత్రి లోకేష్ చెప్పారు.

# స్కిల్ కేసులో సుప్రీం తీర్పుపై టీడీపీ నేతల రియాక్షన్



అమరావతి, జనవరి 15: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బెయిల్ రద్దు చేయాలంటూ గత ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దీనిపై టీడీపీ వర్గాలు స్పందిస్తూ.. చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలనుకున్న వైసీపీకి సుప్రీం కోర్టులో చుక్కెదురైందన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి సీనియర్ లాయర్లను నియమించినా సుప్రీంకోర్టులో వైసీపీ భంగపాటుకు గురైందని టీడీపీ వర్గాలు వ్యాఖ్యలు చేశాయి. స్కిల్ డెవలప్?మెంట్ కేసులో చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసుపై హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని సుప్రీంకోర్టుకు వెళ్లి వైసీపీ భంగపడిందని టీడీపీ లీగల్ సెల్ పేర్కొంది. ఛార్జి సీటు ఫైల్ అయి టెక్నికల్ గ్రౌండ్స్‌లో రిటర్న్ అయి, బెయిల్ కూడా వచ్చి ఏడాదిన్నర దాటిందని ఈ సందర్భంగా తెలుగు దేశం నేతలు గుర్తు చేశారు. అందువలనే ఇంటర్ లోకేటరీ పిటిషన్‌పై వాదనలు వినడానికి కూడా ధర్మాసనం ఇష్టపడలేదని టీడీపీ న్యాయవాదులు పేర్కొన్నారు. అక్రమ కేసు పెట్టడమే కాకుండా అక్రమ కేసులో బెయిల్ రద్దుకు కూడా తెగించిన వైసీపీ అనుకూల నేతల కుట్రలను సుప్రీంకోర్టు చిత్తు చేసిందని వ్యాఖ్యలు చేశారు. అత్యున్నత న్యాయస్థానం ముందు వైసీపీ నవ్వులు పాలయిందని, వ్యాజ్యంలో సంబంధం లేని వ్యక్తులు తల దూర్చడానికి వీల్లేదని నిర్ద్వందంగా సుప్రీం కోర్టు తిరస్కరించిందని టీడీపీ వర్గాలు పేర్కొన్నాయి.

ఇది రాష్ట్రానికి అక్రమ కేసులో అన్యాయంగా ఇరికించబడ్డ వ్యక్తి స్వేచ్ఛకు సంబంధిచిన విషయమని.. ఈ కేసుతో మీకేం సంబంధమని వ్యాజ్యం దాఖలు చేసిన వారిని ధర్మాసనం సూటిగా ప్రశ్నించిందన్నారు. ప్రభుత్వ అధినేత అయి కూడా కేసులో ముద్దాయిగా ఉన్న వ్యక్తి తన పలుకుబడిని ఉపయోగించి కేసును ఉపసంహరించే ప్రయత్నం చేయటం లేదు కదా అని పిటిషనర్‌ను సూటీగా సుప్రీం కోర్టు ప్రశ్నించిందని టీడీపీ నేతలు గుర్తు చేశారు.




ఒకవైపు ఉక్రెయిన్- రష్యాల మధ్య యుద్ధం ఎంతకూ తెగడం లేదు. మరోవైపు గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగుతున్నాయి. అదేవిధంగా ఆయా దేశాల మధ్య భౌగోళిక రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నడుమ.. 2025కు సంబంధించి దేశాల మధ్య సాయుధ ఘర్షణలే ప్రపంచానికి అతిపెద్ద ముప్పు అని ప్రపంచ ఆర్థిక వేదిక పేర్కొంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో డబ్ల్యూఈఎఫ్ సమావేశాల సందర్భంగా తన వార్షిక 'అంతర్జాతీయ నష్ట ప్రమాద నివేదిక'ను విడుదల చేసింది. 900 మంది నిపుణులు, విధానకర్తలు, పరిశ్రమాధిపతులను సర్వే చేసి దీన్ని రూపొందించింది. మొత్తం మీద వాతావరణ సంక్షోభాలను తక్షణ, స్వల్ప, దీర్ఘకాలిక ముప్పుగా పరిగణించింది.

దేశాల మధ్య సాయుధ ఘర్షణలు, విపత్కర వాతావరణ పరిస్థితులు, భౌగోళిక-వాణిజ్య వివాదాలు, తప్పుడు సమాచార వ్యాప్తి, సామాజిక విభజనలను ఈ ఏడాదికి సంబంధించి మొదటి ఐదు తీవ్ర ముప్పులుగా పేర్కొంది. వచ్చే రెండేళ్లలో తప్పుడు సమాచార వ్యాప్తిని అతిపెద్ద ముప్పుగా తేల్చింది. దీంతోపాటు ప్రకృతి ప్రకోపాలు, దేశాల సాయుధ ఘర్షణలు, సామాజిక విభజనలు, సైబర్ గూఢచర్యాలను స్వల్పకాలిక ముప్పులుగా వర్గీకరించింది. పోలాండ్ సరిహద్దుల్లో రష్యా భీకర దాడి.. నాటో యుద్ధ విమానాలు రంగంలోకి..! వచ్చే పదేళ్లలో వాతావరణ వైపరీత్యాలను తీవ్ర ముప్పుగా పరిగణించింది. జీవవైవిధ్య నష్టం-పర్యావరణ వ్యవస్థ పతనం, భూమి ఆవరణ వ్యవస్థల్లో మార్పులు, ప్రకృతి వనరుల కొరత, తప్పుడు సమాచార వ్యాప్తిని దీర్ఘకాలిక ముప్పులుగా పేర్కొంది.

భారత్ వంటి దేశాలు ప్రత్యామ్నాయ శక్తులుగా.. రాబోయే దశాబ్ద కాలంలో ప్రపంచ రాజకీయాల దృక్పథం విషయానికొస్తే.. చాలా మంది నేతలు బహుళ ధ్రువ, వికేంద్రీకరణ పరిస్థితులను ఆశిస్తున్నట్లు నివేదిక తెలిపింది. పాశ్చాత్య దేశాల ఆధిపత్యంలో క్షీణత కొనసాగుతుందని.. చైనా, భారత్, గల్ఫ్ దేశాల రూపంలో ప్రత్యామ్నాయ శక్తులు బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, దేశాల మధ్య విశ్వాసం సన్నగిల్లడం, వాతావరణ సంక్షోభాల వంటివి ప్రపంచానికి సవాళుగా మారాయని డబ్ల్యూఈఎఫ్ ఎండీ మిరెక్ డుసెక్ తెలిపారు. పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడమా? లేదా సంక్లిష్టతలను ఎదుర్కోవడమా? అనేది నేతల చేతుల్లోనే ఉందన్నారు.




## పోలాండ్ సరిహద్దుల్లో రష్యా భీకర దాడి.. నాటో యుద్ధ విమానాలు రంగంలోకి..!

పోలాండ్ సరిహద్దుల్లో ఉక్రెయిన్‌పై రష్యా నేడు భీకర దాడి చేసింది. కీలకమైన గ్యాస్, ఎరువుల సరఫరా కేంద్రాలే లక్ష్యంగా చేసుకొని మాస్కోకు చెందిన ఏడు టీయూ-22, ఆరు టీయూ-95 స్ట్రాటజిక్ బాంబర్లు బాంబు దాడులు చేశాయి. పోలాండ్ సరిహద్దుకు అత్యంత సమీపంలో రష్యా క్షిపణులు పడ్డాయి.

దీంతో నాటో దళాలు అప్రమత్తమయ్యాయి. వెంటనే ఫైటర్ జెట్ విమానాలు గాల్లోకి ఎగిరాయి. నేలపై ఉన్న ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు అప్రమత్తమయ్యాయని నాటో ఆపరేషనల్ కమాండ్ హెడ్‌క్వార్టర్ నుంచి ప్రకటన వెలువడింది. ఉక్రెయిన్ ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలు మొత్తం 40 క్షిపణుల్లో 30ని నేల కూల్చినట్లు అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. వీటికి అదనంగా మరో 70 అటాక్ డ్రోన్లు కూడా దాడి చేశాయన్నారు. నాటో సదస్సులో మిత్ర దేశాలు ఇచ్చిన హామీలు ఇంకా కొన్ని అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. ఎయిర్ డిఫెన్స్‌ల సరఫరాను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు ఉక్రెయిన్ నేషనల్ గ్రిడ్‌లో సమస్య కారణంగా ఆరు ప్రదేశాల్లో అత్యవసర కరెంటు కోతలు విధిస్తున్నారు.


నిన్న రష్యాపై ఉక్రెయిన్ చేసిన దాడికి ప్రతీకారంగానే ఈ దాడి చోటు చేసుకొన్నట్లు రక్షణ నిపుణులు అంచనావేస్తున్నారు. ముఖ్యంగా బ్రిటన్ తయారీ స్ట్రామ్ షాడో, అమెరికా తయారీ ఏటీఏసీఎంఎస్‌లను కీవ్ వాడుతుండటంతో మాస్కో దళాలు ఇబ్బంది పడుతున్నాయి. మంగళవారం దాదాపు 14 క్షిపణులు, 200 డ్రోన్లతో రష్యాపై విరుచుకుపడింది. కెమికల్ ఫ్యాక్టరీలు, విద్యుత్తు కేంద్రాలను లక్ష్యంగా చేసుకొన్నాయి. తాము 2 మిలియన్‌డాలర్ల విలువైన స్ట్రామ్ షాడో క్షిపణులను కూల్చేసినట్లు రష్యా ప్రకటించింది.

# మంత్రి నారా లోకేశ్‌తో మంచు మనోజ్ భేటీ




నారావారిపల్లె: సినీనటుడు మంచు మనోజ్ మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయ్యారు. మనోజ్ కుటుంబ సమేతంగా హైదరాబాద్ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో మోహన్ బాబు యూనివర్సిటీకి భారీ ర్యాలీతో చేరుకోగా.. కోర్టు ఆర్డర్ నేపథ్యంలో లోపలికి వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల సూచనతో వెనుదిరిగిన మనోజ్ నేరుగా నారావారిపల్లె వెళ్లారు. భార్య మౌనికతో కలిసి లోకేశ్‌తో సమావేశమయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు భేటీ కొనసాగింది. అనంతరం మనోజ్ దంపతులు ఎ.రంగంపేట చేరుకుని పశువుల పండుగను వీక్షించారు. సాయంత్రం మోహన్‌బాబు యూనివర్సిటీ ఆవరణలో ఉన్న తన నానమ్మ, అమ్మమ్మ సమాధుల వద్ద నివాళులర్పించిన తర్వాత తిరిగి హైదరాబాద్ వెళ్తారని మంచు మనోజ్ సన్నిహితులు తెలిపారు. తిరుపతిలోని మోహన్ బాబు యూనివర్సిటీ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. యూనివర్సిటీకి మంచు మనోజ్ వస్తున్నారన్న సమాచారంతో గేటు వద్ద పోలీసులు వేచి ఉన్నారు. ఇప్పటికే యూనివర్సిటీలో మోహన్‌బాబు, మంచు విష్ణు ఉండడంతో ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. కాలేజీ పరిసర ప్రాంతాల్లోకి ఎవ్వరినీ అనుమతించడంలేదు. గేట్లను కూడా మూసివేశారు.

# ఎ.రంగంపేటలో పశువుల పండగ.. గాయపడినా లెక్క చేయని యువత



చంద్రగిరి: తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం ఎ.రంగంపేటలో కనుమ పండుగను పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన పశువుల పండగ ఉత్సాహంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున హాజరైన యువకులు.. కోడెలకు కట్టిన పలకలను సొంతం చేసుకునేందుకు పోటీపడ్డారు. అందంగా అలంకరించిన పశువుల కొమ్ములకు బహుమతులు, అభిమాన నేతలు, హీరోల ఫొటోలతో పలకలు కట్టిన రైతులు.. వాటిని పోటీకి వదిలారు. పశువులను పట్టుకునే యువకులకు యజమానులు భారీగా బహుమతులు ప్రకటించడంతో యువత తీవ్రంగా పోటీపడ్డారు. ఈ క్రమంలో కొందరికి గాయాలయ్యాయి. గాయాలవుతున్నా లెక్క చేయకుండా యువకులు పశువుల పండగలో పాల్గొన్నారు.

# నకిలీ టికెట్లతో తిరుమల శ్రీవారి దర్శనం.. పోలీసుల అదుపులో ఐదుగురు



తిరుమల: నకిలీ ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300 టికెట్లు) టికెట్లతో భక్తులకు తిరుమల శ్రీవారి దర్శనం కల్పిస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కొందరు దళారులు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం నకిలీ టికెట్లతో భక్తులకు శ్రీవారి దర్శనం చేయిస్తున్నారు. అనుమానం వచ్చిన తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) విజిలెన్స్ అధికారులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద కొందరు భక్తులను నిలిపివేశారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన విజిలెన్స్ అధికారులు.. ట్యాక్సీ డ్రైవర్ల ద్వారా నకిలీ టికెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. విచారణలో మరో ఐదుగురు నిందితులను అధికారులు గుర్తించారు. వారిలో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం కౌంటర్ ఉద్యోగి లక్ష్మీపతి, అగ్నిమాపక శాఖ సిబ్బంది మణికంఠ, భానుప్రకాశ్, ట్యాక్సీ డ్రైవర్లు శశి, జగదీశ్ ఉన్నారు. లక్ష్మీపతి విధుల్లో ఉన్నప్పుడు నకిలీ టికెట్లతో దర్శనానికి పంపుతున్నట్లు గుర్తించారు. మణికంఠ సాయంతో నకిలీ టికెట్లు తయారు చేస్తున్నారని.. ట్యాక్సీ డ్రైవర్లు శశి (తిరుపతి), జగదీశ్ (చెన్నై) ద్వారా భక్తులకు టికెట్లు విక్రయిస్తున్నట్లు తేల్చారు.

హైదరాబాద్, ప్రొద్దుటూరు, బెంగళూరుకు చెందిన 11 మంది భక్తుల నుంచి రూ.19వేలు వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం ఈ ఐదుగురు నిందితులను తితిదే విజిలెన్స్ అధికారులు, వన్ టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

## చీరకట్టులో అందాల రాశి.. స్టన్నింగ్ లుక్స్

రాశి ఖన్నా.. టాలీవుడ్‌లో తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి. 2014లో విడుదలైన ఊహలు గుసగుసలాడే సినిమాతో మొదలైన అమ్మడి ప్రయాణం ఆ తరువాత హడావుడిగానే కొనసాగింది. హీరోయిన్ గా మొదటి సినిమా మంచి విజయాన్ని అందుకోవడంతో, రాశి ఖన్నా తర్వాత వరుస అవకాశాలను సొంతం చేసుకున్నారు. సుప్రీం, జిల్, తొలిప్రేమ వంటి చిత్రాల్లో నటించి, నటనలో తనకంటూ ఓ ముద్ర వేశారు. టాలీవుడ్‌తో పాటు కోలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమల్లోనూ రాశి తన అందం, ప్రతిభతో ఆకట్టుకుంది. అలాగే బాలీవుడ్‌లో కూడా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న అమ్మడు.. మద్రాస్ కేఫ్ వంటి హిందీ చిత్రాలతో పాటు, తమిళ సినిమాల్లోనూ మంచి అవకాశాలను దక్కించుకుంది. ఆమె కెరీర్‌లో బెస్ట్ సినిమాలలో ఇమైక్క నొడిగల్ తమిళ సినిమా. ఈ చిత్రంలో ఆమె నటనకు విశేషమైన ప్రశంసలు లభించాయి.రాశి ఖన్నా తన సినీ ప్రయాణంలో గ్లామర్ పాత్రలతో పాటు, డిఫరెంట్ కంటెంట్ ఉన్న పాత్రలను కూడా ఎంపిక చేసుకుంటూ ముందుకు




సాగుతున్నారు. తాజాగా రాశి ఖన్నా పొంగల్ సందర్భంగా విషెస్ అందిస్తూ ఎర్రని చీరలో మెరిసిపోతూ దిగిన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. సంప్రదాయ వస్త్రధారణలో స్టైలిష్‌గా కనిపిస్తూ, రాశి తన అందంతో అభిమానులను ఎట్రాక్ట్ చేసింది. ఈ చీరకు తగ్గట్టు మెరిసే బ్లౌజ్ ధరించి, సింపుల్ జువెలరీతో స్టన్నింగ్ లుక్‌లో ఆమె కనిపించారు. సూర్య కాంతి పడ్డ లైటింగ్‌లో, ఆమె ముఖ కాంతి మరింత అందంగా మెరవడం నెటిజన్లను విపరీతంగా ఆకర్షించింది. ఇక రాశి ఖన్నా ఫోటోలకు సంబంధించిన ఈ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆమె అందంగా కనిపించే ఈ ఫోటోలపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

“కణ్మణి” అని క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ ఫోటోలకు కలెక్షన్ లక్షల్లో లైకులు వచ్చాయి. ఈ చీరలో ఆమె చూపించిన ఆహార్యం, ఆమె వ్యక్తిత్వాన్ని మరింత హైలైట్ చేస్తూ, ట్రెడిషనల్ లుక్‌లో కూడా ఆమె ఎంత అందంగా ఉంటారో చూపించారు. ప్రస్తుతం రాశి ఖన్నా పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నా రు. ఒక హిందీ సినిమాతో పాటు, తమిళంలో కూడా ఓ ప్రముఖ హీరోతో సినిమా చేస్తుంది. అంతేకాకుండా, తెలుగులో సిద్ధు జొన్నలగడ్డతో తెలుసు కదా అనే సినిమా లైన్ లో ఉంది. ఇక అమెజాన్ ప్రైమ్ కోసం రూపొందుతున్న ఓ వెబ్‌సిరీస్‌లో కూడా రాశి కీలక పాత్ర పోషిస్తున్నారు. .

## సూపర్‌హీరో మూవీలో వామిక జాక్‌పాట్?

2025 ప్రముఖ బాలీవుడ్ కథానాయిక వామిక గబ్బికి ప్రత్యేక సంవత్సరం కానుంది. ఈ ఏడాదిలో రెండు భారీ ప్రాజెక్టుల్లో నటిస్తోంది వామిక. వీటిలో ఒకటి అక్షయ్ కుమార్ తో భూత్ బంగ్లా. మరొకటి రణవీర్ సింగ్ సరసన సూపర్ హీరో సినిమాలో నటించే వీలుందని కథనాలొస్తున్నాయి. బాలీవుడ్ లో ఒక్కో సినిమాతో తనదైన ముద్ర వేస్తూ వామిక గబ్బి అగ్ర హీరోయిన్ రేసులోకి చేరుకుంది. ఇటీవల చాలామంది సీనియర్ నటీమణులకు దక్కాల్సిన ఛాన్సుల్ని ఈ కుర్రబ్యూటీ తన ఖాతాలో వేసుకుంటోంది. అక్షయ్ కుమార్ ‘భూత్ బంగ్లా’ షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. ప్రస్తుతం జైపూర్‌లో భూత్ బంగ్లా షూటింగ్‌లో ఖిలాడీ అక్షయ్ పాల్గొంటున్నారు. ఇప్పుడు వామికా గబ్బి అతడితో సెట్స్‌లో చేరింది. తాజాగా వామికా గబ్బి ఇన్‌స్టాగ్రామ్‌లో



ఒక వీడియోను షేర్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో అంతర్జాలంలో వైరల్ అవుతోంది. ‘దిల్ కా దర్వాజా ఖోల్ దో నా డార్లింగ్’ చిత్రంలో సిద్ధాంత్ చతుర్వేది, జయా బచ్చన్‌లతో కలిసి వామిక నటిస్తోంది. ఆదిత్య రాయ్ కపూర్ – సమంతా రూత్ ప్రభు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ‘రక్త్ బ్రహ్మాండ్’ వెబ్ సిరీస్‌లో కూడా భాగం కానుంది. నాని సరసన ఓ తమిళ చిత్రంలో నటించనుందని టాక్ ఉంది. అయితే వీటన్నిటిలో సూపర్ హీరో మూవీలో ఆఫర్ గురించి ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రతిభావంతుడైన దర్శకుడు బాసిల్ జోసెఫ్ తెరకెక్కించనున్న సూపర్ హీరో సినిమాలో రణ్‌వీర్ సింగ్ సరసన కథానాయిక పాత్రకు వామికా పోటీపడుతోందని బలంగా టాక్ వినిపిస్తోంది. ఒకవేళ పరిస్థితులు అనుకూలిస్తే వామికా ఈ పాత్రను దక్కించుకునే అవకాశం ఉంది. గతంలో బాసిల్ జోసెఫ్ తెరకెక్కించిన మలయాళ చిత్రం ‘గోధా’లో నటించింది, దీంతో వామిక సూపర్ హీరో మూవీలో ఛాన్స్ కొట్టేయడం ఖాయమని చెబుతున్నారు.





## కంగన ఎమర్జెన్సీకి మరో ఎదురు దెబ్బ



మాజీ భారత ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జీవితం ఆధారంగా రూపొందిన పొలిటికల్ డ్రామా ఎమర్జెన్సీ త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. సెన్సార్ గడపపై చాలా అడ్డంకులను ఎదుర్కొన్న ఎమర్జెన్సీ ఎట్టకేలకు కొన్ని కట్స్ తో విడుదలకు రెడీ అవుతోంది. అయితే రెండు దేశాల మధ్య రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ సినిమాను బంగ్లాదేశ్‌లో నిషేధించారు. తాజా మీడియా కథనాల ప్రకారం.. బంగ్లాదేశ్‌లో ఎమర్జెన్సీ ప్రదర్శనను నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని సమాచారం. సినిమా కంటెంట్ దీనికి కారణం కాదు.. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న రాజకీయ అనైక్యత దీనికి కారణం. భారతదేశం– బంగ్లాదేశ్ మధ్య దెబ్బతిన్న సంబంధాలకు సంబంధించిన వ్యవహారమిది. ఎమర్జెన్సీ భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితకథ. ఇందిర కథలో బంగ్లాదేశ్ కి స్థానం ఉంది. పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్‌ను విభజించడంలో ఇందిరా గాంధీ చురుకైన పాత్ర పోషించారు. 1971 యుద్ధంలో భారతదేశం పాల్గొనడంతో చివరికి అది బంగ్లాదేశ్ ఏర్పాటుకు పరిస్థితి దారితీసింది. అత్యవసర పరిస్థితిలో 1971 బంగ్లాదేశ్ స్వాతంత్ర్య యుద్ధంలో భారత సైన్యం, గాంధీ ప్రభుత్వ పాత్రను బంగ్లాదేశ్ పితామహుడు షేక్ ముజిబుర్ ఎంతగానో కీర్తించారు. రెహమాన్‌తో ఇందిరా గాంధీ గొప్ప సత్సంబంధాలను కొనసాగించారు. భారతదేశం పాకిస్తాన్‌పై యుద్ధంలో విజయం సాధించిన తర్వాత ఇందిరా గాంధీ దేవత దుర్గా అని రెహాన్ సంబోధించారు. యుద్ధ సమయంలో ఆయనకు భారతదేశం నుండి కీలకమైన మద్దతు లభించింది. ఇది అత్యవసర పరిస్థితిలో ముఖ్యమైన పాత్ర పోషించింది. బంగ్లాదేశ్ రాజకీయాల్లో ఇందిర ప్రమేయం కారణంగా, తీవ్రవాదులు అతడిని ఇంట్లోనే హతమార్చారు. చాలా కాలంగా బంగ్లాదేశ్ తో ఇండియా సంబంధాలు నీటి మూటలా మారాయి. రకరకాల కారణాలతో ఇప్పుడు ఎమర్జెన్సీ సినిమాని బంగ్లాదేశ్ లో రిలీజ్ చేయకూడదని ఆంక్షలు విధించారు. అయితే నిషేధానికి సినిమాలో కంటెంట్ ఎంతమాత్రం కారణం కాదని కూడా వెల్లడైంది.

## రవితేజ మాస్ జాతర.. ఆ కిక్కు గ్యారెంటీనా..?




సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా వరుస సినిమాలతో దూసుకెళ్తున్నాడు సితార ఎంటర్టైన్మెంట్స్ సూర్యదేవర నాగ వంశీ. స్టార్ సినిమాలు స్మాల్ బడ్జెట్ సినిమాలు రెండిటినీ కూడా సూపర్ గా బ్యాలెన్స్ చేస్తూ నాగ వంశీ మంచి ప్లానింగ్ తో వస్తున్నారు. ఒక సినిమా రిలీజ్ అయ్యింది అంటే నెక్స్ట్ వెంటనే మరో సినిమా రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ సంక్రాంతికి ఆయన బ్యానర్ నుంచి డాకు మహారాజ్ సినిమా వస్తుంది. బాలకృష్ణ హీరోగా బాబీ డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమా మీద అంచనాలు ఎలా ఉన్నాయో అందరికీ తెలిసిందే. ఈ సినిమా తర్వాత మార్చి ఎండింగ్ లో విజయ్ దేవరకొండ సినిమాతో వస్తున్నాడు. ఐతే ప్రస్తుతం సితార బ్యానర్ లో మాస్ మహారాజ్ రవితేజ హీరోగా మాస్ జాతర సినిమా వస్తుంది. ఈ సినిమాను భాను భోగవరపు డైరెక్ట్ చేస్తున్నారు. ధమాకా కాంబో హీరోయిన్ శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా గురించి నాగ వంశీ అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు. మాస్ మహారాజ్ రవితేజ ఈమధ్య వరుస సినిమాలైతే చేస్తున్నారు కానీ అందుకు తగిన రిజల్ట్ మాత్రం అందుకోవట్లేదు. ధమాకా తర్వాత వాల్తేరు వీరయ్య అది కూడా చిరంజీవి కాంబోలో హిట్ అనిపించుకుంది. సోలో హిట్ కోసం అటు రవితేజ ఇటు మాస్ రాజా ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. రవితేజ మాస్ జాతర మీద అంచనాలు పెంచేస్తున్నాడు నిర్మాత నాగ వంశీ. మాస్ జాతరలో రవితేజ మార్క్ ఫన్ ఉంటుందని సినిమాలో మళ్లీ కిక్కు సినిమాను గుర్తు చేస్తుందని అన్నారు. రవితేజ కిక్ సినిమా సూపర్ హిట్ వైబ్ తెలిసిందే. మళ్లీ అలాంటి కిక్కే మాస్ జాతర ఇస్తుందని అంటున్నారు. మరి నిర్మాత ఇంత కాన్ ఫిడెంట్ గా చెబుతున్నారు అంటే కచ్చితంగా మాస్ మహారాజ్ ఫ్యాన్స్ కి మాస్ జాతర నిజంగానే హిట్టు జాతర ఇచ్చేలా ఉంది. రవితేజ కూడా ఆ మూమెంట్ కోసం వెయిట్ చేస్తున్నాడు. అసలైతే రవితేజ మాస్ జాతర సినిమా సంక్రాంతికే రావాల్సి ఉంది కానీ మధ్యలో రవితేజకు షోల్డర్ ఇంజ్యూరీ వల్ల సినిమా లేట్ అవుతూ వచ్చింది. మాస్ జాతర రిలీజ్ ఎప్పుడు అన్నది ఇంకా మేకర్స్ డిసైడ్ చేయలేదు.

## కన్నడ బ్యూటీకి మరో కేకపెట్టించే ఛాన్స్..

కన్నడ భామ శ్రద్ధ శ్రీనాథ్ ఇప్పుడిప్పుడే వరుస ఆఫర్లతో అదరగొట్టేస్తుంది. కన్నడలో ఆల్రెడీ తన సత్తా చాటుతూ వస్తున్న శ్రద్ధా శ్రీనాథ్ తెలుగులో నానితో జెర్సీ సినిమా చేసింది. జెర్సీలో ఆమె నటనకు మంచి మార్కులే పడ్డాయి. ఆ తర్వాత ఆది సాయి కుమార్ తో ఒక సినిమా చేసినా వర్క్ అవుట్ కాలేదు. లాస్ట్ ఇయర్ సైంధవ్ తో ఛాన్స్ అందుకున్న శ్రద్ధా శ్రీనాథ్ లేటెస్ట్ గా నందమూరి బాలకృష్ణతో డాకు మహారాజ్ ఛాన్స్ అందుకుంది. ఈమధ్యనే రిలీజైన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. డాకు మహారాజ్ హిట్ తో శ్రద్ధా క్రేజ్ మరింత పెరిగింది. ఇక ఇప్పుడు అమ్మడికి మరో లక్కీ ఛాన్స్ వచ్చినట్టు తెలుస్తుంది. సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ డైరెక్షన్ లో వస్తున్న సినిమాలో శ్రద్ధ కూడా ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. రజిని నెల్సన్ కలిసి చేసిన జైలర్



సినిమా సూపర్ హిట్ కాగా ఆ కాంబోలో ఆ సినిమా సీక్వెల్ గా జైలర్ 2 వస్తుంది. జైలర్ 2 సినిమాలో శ్రద్ధ శ్రీనాథ్ లక్కీ ఆఫర్ అందుకుంది. శ్రద్ధ శ్రీనాథ్ సినిమాలో ఇంపార్టెంట్ రోల్ కి ఎంపికైనట్టు తెలుస్తుంది. శ్రద్ధ శ్రీనాథ్ తో పాటు జైలర్ 2 లో తమన్నా కూడా నటిస్తున్నట్టు తెలుస్తుంది. సూపర్ స్టార్ రజినికి చాలా కాలం తర్వాత సూపర్ హిట్ సినిమాగా జైలర్ బాక్సాఫీస్ ని షేక్ చేసింది. ఐతే ఈ సినిమా సీక్వెల్ ని కూడా అంతకుమించి ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. ఈ సీక్వెల్ లో శ్రద్ధ పాత్ర ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుందని తెలుస్తుంది. కన్నడలో తన మార్క్ టాలెంట్ చూపిస్తూ వస్తున్న అమ్మడు ఇప్పుడిప్పుడే తెలుగులో బిజీ అవుతుంది. ఇక ఇప్పుడు తమిళ్ లో కూడా తన పంథా కొనసాగించాలని చూస్తుంది. టాలెంట్ ఉన్నా కూడా సరైన ఛాన్స్ లు రాని శ్రద్ధాకి తెలుగు, తమిళ్ లో మంచి అవకాశాలు వస్తున్నాయి. తప్పకుండా అమ్మడు రాబోయే సినిమాలతో అదరగొట్టేస్తుందని చెప్పొచ్చు. శ్రద్ధ శ్రీనాథ్ ఇక మీదట తన వరుస సినిమాలతో సౌత్ ఆడియన్స్ ని అలరించేలా క్రేజీ ప్రాజెక్ట్ లు చేస్తుందని చెప్పొచ్చు.

## వెండి తెరపై స్టార్ కిడ్స్ -కాక పుట్టించే కాంబినేషన్స్!

స్టార్ కిడ్స్ తెరపై కనిపిస్తే ఆ కిక్కే వేరుగా ఉంటుంది. అందులోనూ ఫేమస్ అయిన హీరోల, హీరోయిన్ల తనయులు జత కడితే తెర మరింత అందంగా మారుతుంది. బాలీవుడ్ ఈ విషయంలో ఎప్పుడూ నిత్య నూతనంగానే హైలైట్ అవుతుంది. తాజాగా మరికొన్ని క్రేజీ కాంబినేషన్స్ ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీ అవుతున్నాయి. ఓసారి ఆ వివరాల్లోకి వెళ్తే.. అజయ్ దేవగణ మేనల్లుడు అమన్ దేవగణ్– అందాల తార రవీనా టాండన్ ముద్దులు కూతురు రాషా తడానీ ఆజాద్ సినిమాతో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. అన్ని పనులు పూర్తి చేసుకుని ఈ చిత్రాన్ని జనవరి 17న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అతిలోక సుందరి శ్రీదేవి రెండవ కుమార్తె ఖుషీ కపూర్ కూడా ఇదే ఏడాది అలరించనుంది. అమీర్ ఖాన్ కుమారుడు జునైద్



ఖాన్ తో ‘లవ్యపా’లో నటిస్తోంది. అలాగే ఇబ్రహీం అలీఖాన్ కి జోడీగా ‘నాదా నీయన్’ లోనూ నటిస్తోంది. ఇదే ఏడాది ఈ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. అలాగే బాలీవుడ్ లో ఉన్న మిగతా ఖాన్ లు..కపూర్ హీరోలకు జోడీగా నటించాలని అమ్మడు ఆశపడుతోంది. సీరియస్ గా ప్రయత్నాలు చేస్తోంది. యంగ్ హీరో సిద్దంత్ చతుర్వేదీ, కార్తీక్ ఆర్యన్ లతోనూ రొమాన్స్ చేయడానికి స్టార్ కిడ్స్ అంతా సిద్దంగా ఉన్నారు. వాళ్లతో నటించే ఛాన్స్ రావాలి గానీ సై అంటూ ముందుకు రావడానికి సిద్దం అంటు న్నారు. అలాగే యంగ్ హీరో లక్ష్య లక్వానీతో అనన్య పాండే ఓ సినిమాలో రొమాన్స్ చేస్తుంది. వామికా గబ్బి, త్రిప్తీ డిమ్రీ లాంటి సీనియర్ భామలు కూడా వారసుల చిత్రాల్లో నటించాలని ఆశపడుతున్నారు. 2025 లో ఈ క్రేజీ కాంబినేషన్స్ అన్ని ప్రేక్షకుల్ని అలరించడం ఖాయం. మరోవైపు నవ నాయికలైనా సీనియర్ హీరోలతో ఛాన్సులొస్తే నటించడానికి ఏమాత్రం ఆలోచించలేదు. ఛాన్స్ ఇవ్వాలేగానీ యస్ అంటూ ముందు కొస్తున్నారు. అయితే ఇలాంటి నవ నాయికలు బాలీవుడ్ లో రష్మిక మందన్నా, కీర్తి సురేష్, సమంత లాంటి వారు బ్రేక్ వేస్తున్నారు. ఈ మధ్య కాలంలో సౌత్ భామలు హిందీలో ఫేమస్ అవ్వడంతో? అనుకున్న స్థాయిలో హిందీ నవ నాయికలకు అవకాశాలు రావడం లేదన్న వాదనా వినిపిస్తోంది.




# సుప్రీంకోర్టులో కేటీఆర్‌కు చుక్కెదురు.. పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్: మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఫార్ములా–ఈ కారు రేసుకు సంబంధించిన కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. %ఏసీబీ నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలని తెలంగాణ హైకోర్టులో కేటీఆర్ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. ఇందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీంతో ఈ నెల 8న ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు.

కేటీఆర్ పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న వర్లే ధర్మాసనం విచారణ జరిపింది. రాజకీయ కారణాలతోనే కేసు నమోదు చేశారని.. ప్రస్తుతం తెలంగాణ విపక్షంలో ఉన్నారని ఆయన తరఫు న్యాయవాది సుందరం సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష నేతగా ఉండటంతోనే కేసులు పెడుతున్నారని వాదించారు. అయితే.. ప్రతిపక్ష నేతగా ఉంటే కేసులు ఎదుర్కోవాలి కదా..? అని జస్టిస్ బేలా ఎం త్రివేది ప్రశ్నించారు. హైకోర్టు తీర్పులో తాము జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. పిటిషన్ వెనక్కి తీసుకుని.. మళ్లీ హైకోర్టును ఆశ్రయించేందుకు అవకాశం ఇవ్వాలని కేటీఆర్ తరఫు న్యాయవాది కోరారు. పిటిషన్ విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పించిన ధర్మాసనం.. మళ్లీ హైకోర్టుకు వెళ్లే స్వేచ్ఛ ఇవ్వలేమని స్పష్టం చేసింది. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

**కేటీఆర్‌కు మళ్లీ నోటీసులు..!** ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు మరోసారి నోటీసులు ఇచ్చేందుకు ఏసీబీ సిద్ధమైంది. ఆయనతోపాటు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు మరో సారి నోటీసులు ఇచ్చే యోచనలో ఉంది. సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కావడంతో నోటీసులపై ఏసీబీ ముందుకెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ ముగ్గురిని ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే.

# ఏఐసీసీ కార్యాలయం ప్రారంభం.. సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జనవరి15: కాంగ్రెస్ పార్టీకి 140 ఏళ్ల చరిత్ర ఉందని.. ఆ పార్టీ ఏ స్వార్థం లేకుండా దేశం కోసం పని చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అంత ఘన చరిత్ర ఉన్న ఈ పార్టీ దళితులు, గిరిజనులు, మైనార్టీల సంక్షేమంతోపాటు అభివృద్ధి కోసం పాటు పడిందని ఆయన గుర్తు చేశారు. ఇన్నేళ్ల దేశాన్ని నడిపిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం సొంత కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొంన్నారు. బుధవారం న్యూఢిల్లీలో ఏఐసీసీ నూతన కార్యాలయాన్ని ఆ పార్టీ అగ్రనేతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. నిన్న కాకుండా మొన్న వచ్చిన ప్రాంతీయ పార్టీలతో పాటు బీజేపీ సైతం పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయని గుర్తు చేశారు. అలాగే ప్రాంతీయ పార్టీల ఆర్థిక స్థితిగతులు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు కోసం ఇక్కడే ఈ కార్యాలయం వేదికగా ప్రణాళికలు రచించబోతున్నామని ఆయన చెప్పారు. రాబోయే రోజుల్లో పేద ప్రజలందరికీ ఇక్కడి నుంచే దశ దిశ నిర్దారిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచంలోనే మేటి దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దేందుకు విధి విధానాలు రూపొందిస్తామన్నారు. దేశ ప్రజలకు ఇది పండగ రోజు అని ఆయన అభివర్ణించారు.

దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ ఈ రోజు అద్భుతమైన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుందని తెలిపారు. దేశ ప్రజల ప్రయోజనానికి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఒక వేదిక కాబోతుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. అలాగే రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించేందుకు పలువురు కేంద్ర మంత్రుల అపాయింట్మెంట్ కోరామన్నారు. అపాయింట్‌మెంట్ వచ్చిన వెంటనే వారిని కలిసి.. తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తామన్నారు.

# ఆ వాదనను ఇప్పుడు మేము ఏకీభవించం: మంత్రి ఉత్తమ్

న్యూఢిల్లీ: కృష్ణ ట్రిబ్యునల్ పై గురువారం నుంచి రెండు రోజుల పాటు సుప్రీంకోర్టులో వాదనలు జరగనున్నాయి. న్యాయస్థానంలో తెలంగాణ తరఫున బలమైన వాదనలు వినిపించాలని అడ్వకేట్ జనరల్, సుప్రీంకోర్టు న్యాయవాది వైద్యనాథన్‌ను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీల ప్రతిపాదనకు సూచనప్రాయంగా ఒప్పుకున్నారని, నీళ్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగవద్దని మంత్రి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 811 టిఎంసిల నీటి కేటాయింపులు జరిగాయని, ఆ వాదనను తాము ఇప్పుడు ఏకీభవించడం లేదన్నారు. తెలంగాణలో నీటి లభ్యత, సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 811 టీఎంసీలు కేటాయించారని, అందులో మెజార్టీ టీఎంసీలు తెలంగాణకు కేటాయించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఏపీలో జగన్మోహన్‌రెడ్డి తన అయిదేళ్ల పరిపాలన కాలంలో సాగునీటి రంగాన్ని పూర్తిగా అటకెక్కించడమే కాకుండా అంతర్రాష్ట్ర జల వివాదాలను జటిలం చేసి వెళ్లారు. అటు కర్ణాటక ఇటు తెలంగాణతో నెలకొన్న పరిష్కారం కాని వివాదాలు దురదృష్టం కొద్దీ కరవు పీడిత ప్రాంతమైన రాయలసీమనే చుట్టుముడుతున్నాయి. ప్రస్తుతం విచారణ జరుపుతున్న కృష్ణ ట్రిబ్యునల్‌లో సమర్ధవంతంగా వాదించేందుకు, అనువైన చర్యలు చేపట్టేందుకు తోడు అంతర్రాష్ట్ర జల వివాదాంశాలపై ఉన్నత స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష సమావేశం నిర్వహించడం ఎంతైనా అవసరం. తుంగభద్ర జలాశయం పూడికతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి పోయిందని కర్ణాటక ప్రభుత్వం ఎగువ భాగంలో వరసబెట్టి రిజర్వాయర్లు నిర్మాణానికి తలపడుతోంది. తుంగభద్ర జలాశయంలో పూడిక ఏర్పడి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడం వాస్తవమైనా దానివల్ల ఒక్క కర్ణాటకే కాకుండా ఆంధ్రప్రదేశ్ వాటాలో కూడా కోత పడుతోంది. ఆంధ్రప్రదేశ్ వాటా 72 టీఎంసీలకు గాను 40 టీఎంసీలు కూడా రావడం లేదు. జగన్ హయాంలోనే 2022లో 29 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం కావడమే కాకుండా, జాతీయ హోదా కూడా లభ్యమైంది. అప్పర్ భద్ర నిర్మాణానికి వ్యతిరేకంగా అప్పట్లో రాయలసీమలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు




జరిగాయి. కాని ముఖ్యమంత్రిగా జగన్ నిమ్మకు నీరెత్తినట్లు ఉండి పోయారు. కాగా 2020లోనే గంగావతి తాలూకాలో నావలి వద్ద 31 టీఎంసీలతో మరొక ప్రాజెక్టు తెరమీదకు వచ్చింది. ఈ ప్రాజెక్టు కూడా తుంగభద్ర జలాశయం నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందనే పేరుతోనే ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను ఇటీవల జరిగిన తుంగభద్ర బోర్డు సమావేశంలో కర్ణాటక ప్రవేశపెట్టి ఆమోదించమని కోరింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎగువ సమాంతర కాలువకు ఆమోదం కోరినట్లు వార్తలు వచ్చాయి. నావలి ప్రాజెక్టు కూడా నిర్మిస్తే తుంగభద్ర జలాశయం ఎగువ భాగంలో 60 టీఎంసీల సామర్థ్యంతో కర్ణాటక రెండు రిజర్వాయర్లను అదనంగా నిర్మించుకొంటుంది.

అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఉన్న కేసు ఇప్పుడు విచారణకు వచ్చింది. ఈ కేసు విచారణ సందర్భంగా సమర్ధవంతంగా వాదించేందుకు అనుభవమున్న లాయర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించవలసి ఉంది. ఆంధ్రప్రదేశ్ ఎగువ సమాంతర కాలువ వరద జలాల ఆధారంగా కోరబడినా ప్రయోజనం లేదు. కర్ణాటక పైభాగం నుంచి వచ్చే వరద కిందకు రాకుండా ఆ రాష్ట్రం రిజర్వాయర్లు నింపుకొంటుంది. కాబట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నావలి ప్రాజెక్టును గట్టిగా వ్యతిరేకించాలి. చంద్రబాబు నాయుడు నిర్వహిస్తున్న సాగునీటి రంగ సమీక్ష సమావేశాల్లో ఇంజనీరింగ్ అధికారులు అంతర్రాష్ట్ర జల వివాదాల్లో ముందుముందు వచ్చే ఇబ్బందులను వివరంగా నివేదించవలసి ఉంది.

# భారాస ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి నోటీసులు జారీ చేసిన పోలీసులు



హైదరాబాద్: భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మాసబ్ ట్యాంక్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. గురువారం విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కరీంనగర్ కోర్టుకు హాజరుకావాల్సి ఉందని, విచారణకు ఈనెల 17న హాజరవుతానని కౌశిక్‌రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ విధులు అడ్డుకోవడం, బెదిరింపుల వ్యవహారంలో ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ ఫిర్యాదు మేరకు గతంలో కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్‌ను దర్యాప్తు అధికారిగా డీసీపీ విజయ్‌కుమార్ నియమించారు.




# 'బ్లాక్‌బోట్స్' అణు రహస్యాలను లీక్ చేసిన ఫిట్‌నెస్ యాప్..!

హిరోషిమా, నాగసాకిపై వేసిన బాంబుల కంటే 1,000 రెట్లు శక్తిమంతమైన అణ్వాయుధాల డేటా లీకైంది. సాధారణంగా రక్షణ దళాల్లో అణుజలాంతర్గాముల కదలికలు అత్యంత రహస్యంగా ఉంటాయి. ఓ రకంగా చెప్పాలంటే అందులోని సిబ్బందికే చివరి నిమిషం వరకు ఎక్కడికి వెళుతున్నారో తెలియని పరిస్థితి కూడా ఉంటుంది. కానీ, ఏకంగా అణు జలాంతర్గాముల బేస్ వివరాలే లీకయ్యాయి. ఒక్కో దానిలో 16 అణు క్షిపణులు ఉన్న నాలుగు సబ్‌మెరైన్లు అక్కడ ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారానికి ఓ ఫిట్‌నెస్ ట్రాకింగ్ యాప్ కారణంగా నిలిచింది. ఫ్రాన్స్‌కు చెందిన ఓ అణుజలాంతర్గామి సిబ్బంది, అధికారుల డేటా సహా.. లొకేషన్ వివరాలు పొరపాటున లీకయ్యాయి. వాస్తవానికి ఆ సబ్‌మెరైన్ రష్యా సమీపంలో గస్తీకి వెళ్లాల్సిఉంది. ఈ వివరాలు మాస్కో చేతికి చేరితే.. ఆ జలాంతర్గామి పరిస్థితేంటని ఫ్రాన్స్ బెంబేలెత్తిపోతోంది. మొబైల్, స్మార్ట్‌వాచ్‌ల్లో వినియోగించే స్ట్రావా యాప్ ఈ మొత్తం తతంగానికి మూలకారణంగా నిలిచింది. అది వినియోగదారుల ఫిట్‌నెస్ కార్యకలాపాలను ట్రాక్ చేసి పర్యవేక్షిస్తుంది. దీనిలో వారు ఎక్కడున్నారు అనే అంశాన్ని అత్యంత కచ్చితత్వంతో గుర్తిస్తుంది. తాజాగా అది బ్రెస్ట్‌హార్బర్‌లో లాంగ్ ఐలాండ్ అనే ఫ్రాన్స్ సబ్‌మెరైన్ బేస్‌ను గుర్తించింది. ఇక్కడ ఉన్న నాలుగు జలాంతర్గాములు కలిపి మొత్తం 64 అణుక్షిపణులను ప్రయోగించగలవు. వీటిని బ్లాక్‌బోట్స్ అంటారు. 1972 నుంచి ఇక్కడ ఉన్న జలాంతర్గాముల్లో ఒకటి ఎప్పుడూ గస్తీలో ఉంటుంది. ఆ సమయంలో దేశంపై అణు దాడి జరిగితే తక్షణం అధ్యక్షుడి ఆదేశాల మేరకు స్పందించేలోపే ఓ రహస్య ప్రదేశంలో కాచుకొని ఉంటుంది. లాంగ్ ఐలాండ్ బేస్‌లో మొత్తం 2,000మంది మిలటరీ సిబ్బంది పని చేస్తున్నారు. ఫ్రాన్స్‌లో ఇదే టాప్ సీక్రెట్ మిలటరీ జోన్. ఇక్కడ కనీసం స్మార్ట్ ఫోన్లను కూడా వాడనీయరు. ఒకవేళ తీసుకెళ్లినా వాటిని స్విచ్ఛాఫ్ చేసి సిగ్నల్ ప్రూఫ్ లాకర్లలో పెట్టేస్తారు. కానీ, కొందరు సిబ్బంది మాత్రం ఫిజికల్ యాక్టివిటీని చెక్ చేసుకోవడానికి థర్డ్‌పార్టీ యాప్స్ వినియోగించే స్మార్ట్ వాచ్‌లను వాడటం మొదలుపెట్టారు. ఇది సేకరించిన డేటా లీకయ్యాక ఫ్రాన్స్ రక్షణశాఖ అప్రమత్తమైంది. గత పదేళ్లుగా స్ట్రావా యాప్ వాడుతున్న దాదాపు 400 మంది సిబ్బందిపై దర్యాప్తు మొదలుపెట్టింది. ఈవిషయాన్ని యూకేకు చెందిన డెయిలీ మెయిల్ కథనంలో పేర్కొంది.

**జలాంతర్గామిలో ప్రయాణించిన విషయాలు కూడా..** ఫ్రాన్స్ పత్రిక లా మాండే కథనం ప్రకారం ఇక్కడ పనిచేసే సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా తమ అసలు పేర్లతోనే యాప్‌లో నమోదైనట్లు తేలింది. పైగా వారి ప్రొఫైల్‌ను పబ్లిక్‌గానే ఉంచారు. ఓ అధికారి మొత్తం 16 సార్లు అణు జలాంతర్గాములున్న ప్రదేశాల్లో జాగింగ్‌కు వెళ్లినట్లు తేలింది. ఆ సమయంలో తన లొకేషన్, టైమ్‌ను అతడు రికార్డు చేశాడు. ఆ తర్వాత రెండు నెలలపాటు అతడి కార్యకలాపాలు ఆ యాప్‌లో నిలిచిపోయాయి. ఆ తర్వాత మళ్లీ మొదలయ్యాయి. దానిలో చాట్ చేస్తూ తాను రెండు నెలలపాటు 'జీవ వ్యర్థాల బాక్స్' (జలాంతర్గామిని ఉద్దేశించి)లోకి వెళ్లి వచ్చాను అని మెసేజ్ చేశాడు. దీనికితోడు స్కూబా డైవింగ్ ఇమేజ్‌లను షేర్ చేశారు. ఇదే స్ట్రావా యాప్‌ను అమెరికా, రష్యా, ఫ్రాన్స్ అధ్యక్షుల బాడీగార్డులు కూడా వాడుతున్నట్లు ఆ ఫ్రాన్స్ పత్రిక కథనంలో పేర్కొంది. దీంతో ఆయా అధ్యక్షుల కదలికలు, ట్రిప్‌ల వివరాలు కూడా ఆ యాప్‌లోకి చేరుతున్నట్లు పేర్కొంది.

# మీ ఆవేదన, ఆక్రోశం దేని కోసం



హైదరాబాద్, జనవరి 15: నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ.. కేంద్రం సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని స్థానిక బీజేపీ ఎంపీ ధర్మపూరి అరవింద్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం స్పందించారు. ఆ క్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకటించిన సందర్భంగా తనపై మీరు చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల మంత్రి తుమ్మల తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. నిజామాబాద్ రైతుల సుదీర్ఘ పోరాటం, చిరకాల నిరీక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగానే కాకుండా.. ఒక రైతుగా తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. ఈ సందర్భంగా.. పార్టీ, ప్రభుత్వంతో నిమిత్తం లేకుండా ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి తాను ధన్యవాదాలు తెలియజేశానని తెలిపారు. ఈ సందర్భంగా తన రాజకీయ జీవితం గురించి మీరు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం...ఆక్షేపణీయంగా ఉన్నాయంటూ ఎంపీ దర్మపురి అరవింద్‌కు తెలియజేశారు. ఈ స్థాయికి దిగజారి మీరు మాట్లాడతారని తాను ఊహించలేదని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానం పట్ల అవగాహన రాహిత్యమో, సమాచార లోపమో తెలియదు కానీ మీ వ్యాఖ్యలు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కానివని స్పష్టం చేశారు. 1983 నుంచి నేటి వరకు తన రాజకీయ జీవితం తెరచిన పుస్తకమన్నారు. పదవుల కోసం, పార్టీ టికెట్ల కోసం ఏ నాడు, ఏ నాయకుడి వద్ద తాను మోకరిల్లింది లేదు... ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నదని తెలిపారు. తన 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రతిక్షణం ప్రజాహితమే తప్ప వ్యక్తిగత స్వార్థం లేదు... ఇకపై ఉండబోదు కూడా అని స్పష్టం చేశారు. ఆ నాడు నందమూరి తారక రామారావు లాంటి మహానుభావుడి నుంచి నేడు రేవంత్ రెడ్డి వరకు ఏ కేబినెట్‌లో పని చేసినా, ఏ హోదాలో విధులు నిర్వర్తించినా రాష్ట్ర అభివృద్ధి, రైతులు సంక్షేమం, పేదల పక్షపాతం తప్ప తనకు మరో ఎజెండా అయితే లేదన్నారు. చంద్రబాబు నాయుడు కావచ్చు... చంద్రశేఖర్ రావు (కేసీఆర్) కావచ్చు.. రాజకీయంగా, సిద్ధాంత పరంగా తనతో విభేదించవచ్చు కానీ.. ప్రజల పట్ల, రాష్ట్రం పట్ల తన కమిట్‌మెంట్‌ను ప్రశ్నించ లేదని వివరించారు. నాయకుడు ఎవరైనా, పార్టీ ఏదైనా ప్రజాహితమే తన అభిమతంగా పని చేశానని చెప్పారు. తనను పార్టీలో చేర్చుకోండి, టికెట్ ఇవ్వండి, పదవి ఇవ్వండంటూ ఈ 40 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో ఏనాడు, ఎవరిని అడిగింది లేదని తెలిపారు. తన వల్ల సమాజానికి మంచి జరుగుతుంది, తన పని తీరుతో రాష్ట్రానికి మేలు జరుగుతుందని విశ్వసించి ఆయా పార్టీల నేతలను తనను కోరుకున్నారని గుర్తు చేశారు. ప్రజలు ఆదరించారు తప్ప... తాను ఏ పార్టీ గుమ్మం ముందు, ఏ నాయకుడు వద్ద సాగిలపడింది లేదని స్పష్టం చేశారు. ఈ తన రాజకీయ జీవితంలో ఉమ్మడి రాష్ట్రంలో కానీ.. తెలంగాణ రాష్ట్రంలో కానీ.. ఏ మూలకు వెళ్లినా అక్కడ అభివృద్ధి ఆనవాళ్లలో తన గుర్తులు కనిపిస్తాయన్నారు. సాగునీటి ప్రాజెక్టులైనా, జాతీయ రహదారులైనా వాటి నిర్మాణంలో తన పాత్ర, తన శ్రమ ఉంటుందని తెలిపారు.

# తెలంగాణ ప్రజలకు కేటీఆర్ క్షమాపణ చెప్పాల్సిందే: ప్రభుత్వ విప్ డిమాండ్..



హైదరాబాద్: ఫార్ములా–ఈ కార్ రేసు కేసులో సుప్రీంకోర్టు తీర్పుపై తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చెంపపెట్టని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్ము దోచుకున్న కేటీఆర్.. కుంభకోణం లేదు లంబకోణం లేదని అన్నారని శ్రీనివాస్ మండిపడ్డారు. ప్రజాధనం దుర్వినియోగం చేసిన వాళ్లపై చర్యలు తీసుకుంటే అక్రమ కేసులు అంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేసిన వారిని ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని ప్రభుత్వ విప్ తేల్చి చెప్పారు. ఇందుకు కోర్టులూ ప్రభుత్వానికి సహకరించడం సంతోషంగా ఉందని ఆయన చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో లాగా ఇళ్ల తలుపులు విరగొట్టి మరీ అరెస్టులు చేయడం లేదని ఆయన విమర్శించారు. తనపై తప్పుడు కేసులు నమోదు చేశారని కేటీఆర్ చెప్తున్నారని, ఇప్పుడు ఉన్నత న్యాయస్థానం తీర్పుపై తెలంగాణ ప్రజలకు ఆయన ఏం సమాధానం చెప్తారంటూ ప్రశ్నించారు. ఫార్ములా–ఈ కార్ రేసు కేసులో ఏసీబీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని హైకోర్టును కేటీఆర్ ఆశ్రయించారని, అందుకు న్యాయస్థానం నిరాకరించిందని శ్రీనివాస్ గుర్తు చేశారు. దీనిపై ఆయన ఉన్నత న్యాయస్థానానికి వెళ్లినా సుప్రీంకోర్టు తన తీర్పుతో కేటీఆర్‌కు చెంపదెబ్బ కొట్టినట్లయ్యిందని ఆయన ఎద్దేవా చేశారు. ఏసీబీ, ఈడీ నమోదు చేసిన కేసుల్లో న్యాయం ఉందని అందుకే కోర్టులు కేటీఆర్‌కు అనుకూలంగా తీర్పు ఇవ్వలేదని శ్రీనివాస్ చెప్పారు. ఈ కేసుల్లో కేటీఆర్ ఇప్పటివరకూ చేసిన హంగామాకు, చేస్తున్న దానికి సైతం బహిరంగ క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాగా, ఏసీబీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని, హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై నేడు విచారణ చేపట్టిన ధర్మాసనం హైకోర్టు తీర్పుపై జోక్యం చేసుకోలేమంటూ కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసింది.

# పుప్పాలగూడ జంట హత్యల కేసు.. వివాహేతర సంబంధమే కారణమా?



హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడ జంట హత్యల కేసులో పోలీసులు పురోగతి సాధించారు. అనంత పద్మనాభస్వామి ఆలయ గుట్టల వద్ద దారుణహత్యకు గురైన యువతి, యువకుడిని పోలీసులు గుర్తించారు. హత్యకు గురైన బిందు ఈ నెల 3న అదృశ్యమైనట్లు వనస్థలిపురంలో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతి చెందిన అంకిత్ సాకేత్‌పై ఈనెల 8న గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. నార్సింగి పరిధిలోని పుప్పాలగూడలో వీరు మంగళవారం హత్యకు గురైన విషయం తెలిసిందే. వివాహేతర సంబంధమే హత్యకు కారణం అయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com